# వాస్తవ నేస్తం


తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 2 | సంచిక : 274 | శుక్రవారం 3 మే 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# తెలుగు రాష్ట్రాలే టార్గెట్!



- రంగంలోకి ప్రధాని మోదీ..
- బీజేపీ ప్రచారం హోరెత్తాల్సిందే..
- ఇప్పటికే రెండు సార్లు తెలంగాణలో ప్రచారానికి వచ్చిన మోదీ
- తెలంగాణపై బీజేపీ స్పెషల్ ఫోకస్
- టార్గెట్ తెలంగాణ అంటూ డబుల్ డిజిట్ సీట్ల కోసం వ్యూహం
- ఈ నెల 8, 10వ తేదీల్లో తెలంగాణలో సుడిగాలి పర్యటనలో మోదీ
- తెలంగాణతో పాటు ఏపీపై కూడా ఫోకస్ పెడుతున్న ప్రధాని మోదీ.
- మోదీ రాక నేపథ్యంలో భారీ స్వాగత ఏర్పాట్లుకు సన్నద్ధమవుతోన్న ఏపీ బీజేపీ

హైదరాబాద్


మరోసారి ఛలో తెలంగాణ అంటున్నారు బీజేపీ అగ్ర నేతలు. తమ పర్యటనలతో తెలుగు రాష్ట్రాల్లో ప్రచార పర్వాన్ని మరింత వేడెక్కించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షాల రాకతో క్లైమాక్స్‌లో కాక పుట్టనుంది. ఇప్పటికే.. తెలంగాణపై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. టార్గెట్ తెలంగాణ అంటూ డబుల్ డిజిట్ సీట్ల కోసం వ్యూహం ప్రారంభించింది. ప్రధాని మోదీ కూడా తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల సమరాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. -మిగతా3లో


# ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

- మొత్తం 12 జిల్లాలతో కూడిన ఈ నియోజకవర్గంలో పోటీ చేయాలనుకునే అభ్యర్థులంతా నల్లగొండ కలెక్టరేట్‌లోనే తమ నామినేషన్లను సమర్పించాలి
- ఈ నెల 9వ నామినేషన్ల సమర్పణకు ఆఖరి తేదీ.
- 10వ తేదీన నామినేషన్ల పరిశీలన 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ
- ఈ నెల 27వ తేదీన పోలింగ్.. జూన్ 5వ తేదీన ఫలితాలు
- పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయిన సంగతి తెలిసిందే.
- కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న..
- ఇంకా అభ్యర్థులను ప్రకటించని బిజెపి బీఆర్ఎస్‌లు..

హైదరాబాద్

నల్గొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల అయ్యింది. గురువారం ఉదయం నోటిఫికేషన్ విడుదల కాగా.. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్.. మొత్తం 12 జిల్లాలతో కూడిన ఈ నియోజకవర్గంలో పోటీ చేయాలనుకునే అభ్యర్థులంతా నల్లగొండ కలెక్టరేట్‌లోనే తమ నామినేషన్లను సమర్పించాల్సి ఉంది. ఈ నెల 9వ నామినేషన్ల సమర్పణకు ఆఖరి తేదీ. నామినేషన్ల పరిశీలన 10వ తేదీన -మిగతా3లో






## కాంగ్రెస్ ఇక్కడ చస్తోందని పాకిస్తాన్ అక్కడ ఏడుస్తోంది

- కాంగ్రెస్ కోసం పాకిస్తానీ నాయకులు ప్రార్థనలు చేస్తున్నారు
- భారత్‌లో బలహీన ప్రభుత్వం ఉండాలని శత్రువులు కోరుకుంటున్నారు
- విరుచుకుపడ్డ మోదీ
- రామ, శివ భక్తుల మధ్య చిచ్చు పెట్టేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు
- మన ఆచార వ్యవహారాలు వేలాది సంవత్సరాల నుంచి వేళ్లూనుకున్నాయి

# కేసులపై తగ్గేదేలే

- బీజేపీ టార్గెట్‌గా సీఎం రేవంత్ కీలక ఆరోపణలు..
- బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారు
- రిజర్వేషన్లపై ప్రశ్నించినందుకే తనపై కేసు పెట్టారు
- ఢిల్లీ పోలీసులను పంపి అరెస్ట్ చేయాలని చూస్తున్నారు
- గతంతో తనపై 200 వందల కేసులు పెట్టి చంచలగూడ, చర్లపల్లి జైలుకు పంపిన అయినా ఎక్కడా వెనకడుగు వేయలేదు
- విద్యాభివృద్ధికి బీజేపీ కృషి చేయలేదు
- కేంద్రమంత్రివర్గంలోనూ గోండులకు స్థానం దక్కలేదు
- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు గోండులు, లంబాడ హక్కులను కాలరాస్తున్నాయి
- కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తోంది
- విద్యా, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోంది




ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ సభలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారన్నారు రేవంత్. రిజర్వేషన్లపై ప్రశ్నించినందుకే తనపై కేసు పెట్టారన్నారు. ఢిల్లీ పోలీసులను పంపి అరెస్ట్ చేయాలని చూస్తున్నారని, ఇలాంటి కేసులకు తాను భయపడనన్నారు. గతంతో తనపై 200 వందల కేసులు పెట్టి చంచలగూడ, చర్లపల్లి జైలుకు పంపారని గతాన్ని గుర్తు చేశారు. అయినా తాను ఎక్కడా వెనకడుగు వేయలేదని ఆసిఫాబాద్ జనజాతర బహిరంగ సభలో ప్రజలకు తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీపై అనేక ఆరోపణలు చేశారు. గల్లీ నుండి ఢిల్లీ వరకు ఆదిలాబాద్ సమస్యలను వినిపించేందుకు ఆదివాసీ ఆడబిడ్డకు కాంగ్రెస్ అవకాశం ఇచ్చిందన్నారు. ఆసిఫాబాద్‌కు ఒక ప్రత్యేకత ఉందని.. -మిగతా3లో



## బిలియనీర్ స్నేహితులకు దోచిపెట్టడమే మోదీ అజెండా

- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ
- ఈ సొమ్ము తన బిలియనీర్ స్నేహితులకు చేరదని ఆయన అసహనానికి లోనవుతున్నారని
- కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు అప్రంటీస్ హక్కు కల్పిస్తామని హామీ
- మహిళలకు మహాలక్ష్మి పథకం గురించి మాట్లాడిన ప్రతిసారీ ప్రధాని నరేంద్ర మోదీ చిరాకు పడుతున్నారు

-2లో

# బీజేపీ కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న మోదీకి, అమిత్ షాకు నోటీసులు జారీ చేయరు
- ఆవేదనతో మాట్లాడిన కేసీఆర్‌కు మాత్రం నోటీసులు జారీ చేసి, 48 గంటల పాటు ప్రచారంపై నిషేధం విధించారు
- చివరకు ఎన్నికల కమిషన్ కూడా బీజేపీ కనుసన్నల్లో నడుస్తోంది.
- బస్సు యాత్ర ప్రారంభంతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెల్లో దడ పుట్టింది
- కేసీఆర్ బస్సు యాత్రకు వస్తున్న ప్రజా స్పందనను చూసి ఆ రెండు పార్టీలు ఓర్వలేకపోతున్నాయి

హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న మోదీకి, అమిత్ షాకు నోటీసులు జారీ చేయరు. కానీ ఆవేదనతో మాట్లాడిన కేసీఆర్‌కు మాత్రం నోటీసులు జారీ చేసి, 48 గంటల పాటు ప్రచారంపై నిషేధం విధించారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై 48 గంటల పాటు ఈసీ నిషేధం విధించింది. ఇవాళ రాష్ట్రంలో, దేశంలో ఉన్న పరిస్థితులు చూస్తుంటే.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం, వారు తీసుకున్న నిర్ణయాలు దానికి అనుగుణంగా జరిగిన నియామకాలు, స్వయం ప్రతిపత్తి సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ఆటాడిస్తున్నట్లు స్పష్టమవుతుంది. చివరకు ఎన్నికల కమిషన్ కూడా బీజేపీ -మిగతా3లో



## ఎన్నికల వేళ భారీగా మద్యం పట్టివేత

- పోలీసులకు చిక్కిన నిబంధనలు అతిక్రమించి అక్రమంగా తరలిస్తున్న మద్యం
- 37 లక్షల విలువగల నాలుగువేల లీటర్స్ మద్యం
- ఎన్నికల నేపథ్యంలో మద్యం సరఫరాకు చెక్ పెట్టేందుకు అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులు
- దాదాపు నాలుగు వేల లీటర్ల మద్యాన్ని పట్టుకున్న ఎస్‌వోటీ పోలీసులు

# బీజేపీ కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం

-మొదటి పేజి తరువాయి

కనుసన్నల్లో నడుస్తోంది. ఇందులో ఎలాంటి రెండో ఆలోచన, అభిప్రాయం తమకు లేదు. దేశంలో బీజేపీ వాళ్లు జాతులు, మతాల ఆధారంగా.. ప్రధాని, హోం మంత్రి మత వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడిన, విద్వేషాన్ని రెచ్చగొట్టేలా దారుణమైన వ్యాఖ్యలు చేసినా, ప్రత్యర్థ పార్టీలను బీజేపీ నాయకులు బండబూతులు తిడుతున్నా.. వాళ్ల బీజేపీ4 ఇండియా అఫిషియల్ ట్విట్టర్ ముస్లింలపై విషం చిమ్ముతూ.. ప్రచారం చేస్తున్నా ఒక్క చర్య లేదు. కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి నోటీసులు జారీ చేయలేదు అని కేటీఆర్ తెలిపారు.

**మోదీకి భయపడ్డ ఎన్నికల సంఘం**

ఇటీవలే మోదీ దారుణంగా మాట్లాడారు. ఈ దేశంలో ముస్లింలే ఎక్కువ పిల్లలు కంటారని, వేరే వారు అధికారంలోకి వస్తే దేశ సంపదను ముస్లింలకు దోచి, పంచి పెడుతారని ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తే దాదాపు 25 వేల మంది పౌరులు ఎన్నికల కమిషన్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. కానీ కనీసం మోదీకి నోటీసు కూడా ఇవ్వలేదు. చర్యలు తీసుకోవడం లేదు. మోదీకి భయపడ్డ ఎన్నికల సంఘం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు నోటీసులు జారీ చేశారు. మోదీ వ్యాఖ్యలపై నడ్డా జవాబు ఇవ్వాలని తలాతోక లేని నిర్ణయం ఎన్నికల కమిషన్ తీసుకుంది అని కేటీఆర్ గుర్తు చేశారు.

**ఫిర్యాదులు చేసినా.. ఉలుకు పలుకు లేదు..**

ఎన్నికల్లో దేవుడిని, మతాన్ని ఇన్‌వాల్వ్ చేయడం నేరం. అమిత్ షా శ్రీరాముడి బొమ్మ పట్టుకుని ఎన్నికల ప్రచారం చేశారు. దీనిపై కూడా ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. అయినా ఉలుకు పలుకు లేదు. బీజేపీ అభ్యర్థి అరుణ్ గోవిల్ గతంలో రామాయణం సిరీయల్‌లో రాముడి పాత్ర పోషించారు. ఆయన రాముడి ఫొటోతో ప్రచారం చేశారు. చర్య, నోటీసులు లేవు. బీజేపీ4 ఇండియా అఫిసియల్ ట్విట్టర్‌లో రాముడి ఫొటో పెట్టి మీ ఓటును బీజేపీకి వేయాలని ప్రేరేపిస్తున్నారు. మోదీ విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేసినా, హోం శాఖ మంత్రి రాముడి ఫొటో పట్టుకుని ఓట్లు అడిగానా ఉలుకు పలుకు లేదు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, హిందూ ముస్లింలను విడదీసేలా బీజేపీ4ఇండియా దాడి చేసినా ఎన్నికల కమిషన్ మేల్కోవడం లేదన్నారు కేటీఆర్.

**కేసీఆర్ గొంతు నొక్కారు..**

అదే కేసీఆర్ విషయానికి వస్తే ఆగమేఘాల మీద నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందిన తర్వాత మా లాయర్లు,



నాయకుల స్పందించి లీగల్ సెల్ ద్వారా జవాబు ఇచ్చారు. ఈ మద్యకాలంలో ఎండిన పంటల పరిశీలనకు కరీంనగర్‌కు వచ్చినప్పుడు సిరిసిల్లలో మీడియా సమావేశం నిర్వహించారు కేసీఆర్. ఎండిన పంటలు చూసిన తర్వాత, రైతుల ఆర్తనాదాలు విన్న తర్వాత కాంగ్రెస్ పార్టీకి బుద్ధి లేదు.. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు.. నీళ్లు ఉండి ఇవ్వలేని ప్రభుత్వం ఇది అని కొంత పరుషంగా చెప్పారు. బతుకమ్మ చీరలు ఆర్డర్లు ఇవ్వండి.. మా బతుకును కాపాడాలని, మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని మొర పెట్టుకున్నారు. వారి ఆవేదన, బాధ చూసిన తర్వాత భావోద్వేగతంతో కేసీఆర్ ఒక మాట అన్నారు. ఆ ఒక్క మాట మాట్లాడేసరికి కేసీఆర్ గొంతు నొక్కారు. 48 గంటల పాటు ప్రచారంపై నిషేధం విధించారు అని కేటీఆర్ తెలిపారు.

**కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెల్లో దడ పుట్టించిన కేసీఆర్ బస్సు యాత్ర**

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభంతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెల్లో దడ పుట్టిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ బస్సు యాత్రకు వస్తున్న ప్రజా స్పందనను చూసి ఆ రెండు పార్టీలు ఓర్వలేకపోతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన పరుష పదజాలం మీద ఎన్నికల సంఘానికి 8 ఫిర్యాదులు ఇచ్చాం. కానీ చర్యల్లేవు. కేసీఆర్‌ను ఉరితీస్తాం.. లాగుల తొండలు వదులుతాం.. ముడ్డి మీద డ్రాయర్ కూడా ఉండదు.. కేసీఆర్ తల నరకండి.. కేసీఆర్ తల తెగ్గోయండి అని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ మాటలు ఎన్నికల సంఘానికి నీతిసూక్తులు, సుభాషితాల్లాగా వినబడుతున్న ట్లుంది. ఈ మాటలు ఈసీకి వినిపించవు. అదే కేసీఆర్ నేతన్నలు, రైతుల పక్షాన మాట్లాడితే గట్టిగా ఒక్క మాట మాట్లాడితే.. 48 గంటల నిషేధం విధించారు అని కేటీఆర్ తెలిపారు.

**ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ పన్నాగం..**

బడా భాయ్.. చోటా భాయ్ కన్నుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం పని చేయకపోతే.. తామిచ్చిన 27 ఫిర్యాదులపై స్పందించాలి. రేవంత్ మీద 8, మరో 19 ఫిర్యాదులు మిగతా పార్టీ నాయకులు, వారి వైఖరి మీద ఈసీకి ఫిర్యాదు చేశాం. ఒక్కటంటే ఒక్కదాని మీద కూడా చర్య లేదు. కొండా సురేఖకు మందలింపు తప్ప ఒక్కటంటే ఒక్క చర్య లేదు. వారి ప్రచారాన్ని నిషేధించలేదు. కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభించగానే కాంగ్రెస్‌కు, బీజేపీకి దడ పుట్టింది. స్టేట్‌లో ఇంటెలిజెన్స్ రిపోర్ట్, కేంద్రంలో ఐబీ రిపోర్టు ఎప్పటికప్పుడు ఇస్తున్నాయి. కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మంచి స్పందన వస్తుందని ఆ పార్టీలకు కంటగింపుగా మారింది. 2014లో బడా భాయ్ చేసిన మోసం, 2023లో చోటా భాయ్ చేసిన మోసాన్ని పూసగుచ్చినట్టు ప్రజలకు వివరిస్తుంటే.. తట్టుకోలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇది ఒక పన్నాగం అనేది పార్టీ స్థిరమైన అభిప్రాయం అని కేటీఆర్ పేర్కొన్నారు.

**కాంగ్రెస్, బీజేపీకి నిద్ర పట్టడం లేదు..**

కేసీఆర్ బస్సు యాత్రకు జనస్పందన చూసిన తర్వాత రెండు పార్టీలకు నిద్ర పట్టడం లేదు. 8 -12 సీట్లు బీఆర్ఎస్‌కు వస్తున్నాయని సర్వేలు వస్తున్నాయి. మొన్నటి దాకా బీఆర్ఎస్‌ను ఒక్క సీటు కూడా గెలవనివ్వం అని అన్నారు. కేసీఆర్ బస్సు యాత్ర తర్వాత వస్తున్న స్పందనను జీర్ణించుకోలేక ఇద్దరు కూడబలుక్కొని కేసీఆర్‌ను ప్రజల వద్దకు వెళ్లనీయకుండా ఆపడం అప్రజాస్వామిక చర్య. ప్రజలు దీనికి ఓటుతోనే సమాధానం చెప్తారని అనుకుంటున్నాను అని కేటీఆర్ తెలిపారు.

**కేసీఆర్ సైన్యాన్ని అడ్డుకోలేరు..**

రేవంత్ రెడ్డి ఇంకా చండాలంగా మాట్లాడారు. ఆ మాటలు మేం అనేందుకు సిగ్గు అనిపిస్తుంది. ఆయన మాటలపై ఫిర్యాదు చేస్తే.. గోడకు చెప్పుకున్నట్టే ఉంది కానీ ఈసీ నుంచి స్పందన లేదు. కానీ కేసీఆర్ పట్ల రాకెట్ వేగంతో స్పందించి నిషేధం విధించారు. మీది నిజంగా స్వయం ప్రతిపత్తి సంస్థ అయితే.. ఎందుకు మోదీ మీద చర్యల్లేవు. మోదీకి నోటీసులు ఇవ్వాలంటే ఎందుకు వణికి చచ్చిపోతున్నారు. నడ్డాకు ఎందుకు ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి విషయంలో మీ గొంతు ఎందుకు పెగడలం లేదు..? 48 గంటల పాటు కేసీఆర్ ప్రచారాన్ని నిషేధించొచ్చు కానీ కేసీఆర్ తయారు చేసిన సైన్యాన్ని మీరు అడ్డుకోలేరు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

-మొదటి పేజి తరువాయి

ఉంటుంది. 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఈ నెల 27వ తేదీన పోలింగ్ జరుగుతుంది. జూన్ 5వ తేదీన ఫలితాలు వెల్లడికానున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ గా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయిన సంగతి తెలిసిందే.

**పట్టభద్రుల ఓటర్లు ఎంతమందంటే?**

ఈ పట్టభద్రుల నియోజకవర్గం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో విస్తరించి ఉంది. మూడు ఉమ్మడి జిల్లాల్లోని 12 జిల్లాల్లో 4,61,806 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకొన్నారు. వీరిలో 2,87,007 మంది పురుషులు, 1,74,794 మంది మహిళలు, ఇతరులు ఉన్నారు. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నల్గొండ జిల్లా కలెక్టర్ హరి చందన వ్యవహరిస్తారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లో నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుంది.

**కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న**

ఈ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ బరిలో నిలవనున్నారు. ఈ మేరకు తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. 2021 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న మల్లన్న గణనీయమైన ఓట్లను సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఈసారి ఆయన కాంగ్రెస్ తరపున పోటీ




చేస్తున్నారు. ఇటీవల కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్?ను తీన్మార్ మల్లన్న ఆశించారు. కాంగ్రెస్ అధిష్టానం మాత్రం వెలిచాల రాజేందర్ రావును అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో మల్లన్నను ఎమ్మెల్సీగా నిలబెట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

**ఇంకా అభ్యర్థులను ప్రకటించని బిజెపి బీఆర్ఎస్‌లు**

వరంగల్ - ఖమ్మం -నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయగా, తొలి రోజు ముగ్గురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. అయితే ప్రధాన పార్టీలైన బిజెపి, బీఆర్ఎస్?లు ఇంకా తమ అభ్యర్థులను ప్రకటించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై బిఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. బీఆర్ఎస్ మూడు, నాలుగు రోజుల్లో తమ అభ్యర్థిని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. మరో వైపు బిజెపి కూడా అభ్యర్థిని ఖరారు చేసే ప్రయత్నాల్లో ఉంది.

## ఈ పార్టీలో ఆధిపత్య పోరుకు చెక్..


### గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్న నేతలు..

తెలంగాణ బీజేపీ క్రమశిక్షణ పట్టాలెక్కినట్లు కనిపిస్తోంది. కాషాయ పార్టీ రాష్ట్ర నేతలంతా దాదాపుగా లోక్ సభ ఎన్నికల ప్రచార బరిలో ఉన్నారు. దీంతో ఎవరి నియోజకవర్గాల్లో వారు ప్రచార పనుల్లో మునిగిపోయారు. కిషన్?రెడ్డి.. బీజేపీ రాష్ట్ర సారథిగా రోడ్ షోలు నిర్వహిస్తూ సికింద్రాబాద్?పార్లమెంట్?స్థానంలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పార్టీ జాతీయ అగ్రనేతలతో సహా అందరూ జిల్లాల్లో పర్యటిస్తున్నారు. మిగతా నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఇక బండి సంజయ్.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రచారం చేస్తూ బిజీగా ఉన్నారు. డీకే అరుణ పాలమూరులో, అరవింద్?నిజామాబాద్?లో, ఈటల రాజేందర్?మల్కాజిగిరిలో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ గెలుపే లక్ష్యంగా నియోజకవర్గాల్లో బీజేపీ నేతలు పనిచేసుకుంటున్నారు. పార్టీలో ప్రతిష్ఠ పెంచుకోవాలంటే గెలిచితీరాలని తెలంగాణ కాషాయ పార్టీ నేతలు గట్టిపట్టుదలతో ఉన్నారు. గతంలోని ఆధిపత్య పోరు పక్కన పెట్టి తమ పని తాము చేసుకుంటు పోతున్నారు. రాష్ట్ర బీజేపీ నేతల మధ్య పూర్తిస్థాయిలో ఐక్యత కుదరనప్పటికీ.. గెలవకపోతే పార్టీలో ఉనికి కష్టసాధ్యమవుతుందనే భావన ఏర్పడింది. కలిసికట్టుగా కాకపోయినా.. ఎవరి ఇలాకాల్లో వారు గెలిచి తీరాలని శ్రమిస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత బండి సంజయ్, ఈటల రాజేందర్?మధ్య ఆధిపత్య పోరు అధిష్టానం వరకు వెళ్లింది. సోషల్ మీడియాలో పరస్పరం ఎవరి వర్గం వారికి అనుకూల పోస్టులు పెట్టడం పెద్ద రచ్చగా మారింది. ఎన్నికల షెడ్యూల్?వరకు కనిపించిన ఆధిపత్య పోరు.. టికెట్ల ప్రకటన తర్వాత అంతా సర్దుకుంది. టీ-బీజేపీ నేతలకు పార్టీ అధిష్టానం గట్టి క్లాసే తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీలో ఒకరిని మరొకరు వెన్నుపోటు పొడుచుకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి వస్తుందని బీజేపీ అగ్రనేతలు వార్నింగ్?ఇవ్వడంతో తెలంగాణ కమలనాథులు దారికి వచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. బండి సంజయ్, ఈటల రాజేందర్, అరవింద్, డీకే అరుణ, రఘునందన్?లాంటి నేతలు తాము పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో తప్పితే.. పక్క నియోజకవర్గాల్లో కన్నెత్తి కూడా చూడటం లేదు. ఎన్నికల వరకు పార్టీ అంతర్గత వ్యవహారాలు చక్కబడ్డట్లు కనిపిస్తున్నా.. ఎన్నికల తర్వాత పరిస్థితి ఏంటనే దానిపై కార్యకర్తల్లో చర్చ కొనసాగుతోంది.

## తెలుగు రాష్ట్రాలే టార్గెట్!

-మొదటి పేజి తరువాయి

ఈ నేపథ్యంలో ఇప్పటికే రెండు సార్లు తెలంగాణలో ప్రచారానికి వచ్చిన మోదీ మరోసారి తెలంగాణ గడ్డ మీద అడుగు పెట్టబోతున్నారు. ఈ నెల 8, 10వ తేదీల్లో తెలంగాణలో సుడిగాలి పర్యటనలతో మోదీ చుట్టెయ్యనున్నారు. ఈనెల 8న వేములవాడ, ఆ తర్వాత వరంగల్ జిల్లా మడికొండ బహిరంగ సభల్లో మోదీ పాల్గొంటారు. ఇక ఈ నెల 10న నారాయణపేట, హైదరాబాద్‌లో జరిగే సభలో



మోదీ పాల్గొంటారు. తెలంగాణతో పాటు ఏపీపై కూడా ఫోకస్ పెడుతున్నారు ప్రధాని మోదీ. ఈ నెల 8న విజయవాడకు వెళ్లనున్న మోదీ.. ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు రోడ్ షో నిర్వహిస్తారు. మోదీ రాక నేపథ్యంలో భారీ స్వాగత ఏర్పాట్లుకు సన్నద్ధమవుతోంది ఏపీ బీజేపీ. అయితే 6వ తేదీన కూడా ఏపీలో మోదీ పర్యటిస్తారా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇక మోదీతో.. రాజమండ్రి ,అనకాపల్లి, రాజంపేట, తిరుపతి లో భారీ బహిరంగ సభలకు ఏపీ బీజేపీ ప్లాన్ చేస్తోంది. ఏపీలో మోదీ పర్యటన కోసం.. కూటమి నేతలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఈ నెల 5న తెలంగాణకు రానున్నారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానం పరిధిలోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. ఆ తర్వాత నిజామాబాద్, మల్కాజ్‌గిరి సభల్లో పాల్గొంటారు. ఇక బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఈ నెల 6న పెద్దపల్లి, భువనగిరి, నల్లగొండ సభల్లో పాల్గొంటారు.

## ఎన్నికల వేళ భారీగా మద్యం పట్టివేత..




**హైదరాబాద్ :** ఎన్నికల వేళ నగరంలో భారీగా మద్యం పట్టుబడింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం సరఫరాకు చెక్ పెట్టేందుకు పోలీసులు అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే నిబంధనలు అతిక్రమించి అక్రమంగా తరలిస్తున్న మద్యం పోలీసులకు చిక్కింది. తాజాగా దాదాపు నాలుగు వేల లీటర్ల మద్యాన్ని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. సైబరాబాద్ సీపీ నిర్ధిష్టమైన సూచనల మేరకు సైబరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో ఎస్‌వోటీ పోలీసులు, వివిధ పోలీసు స్టేషన్ల సిబందితో కలిసి నిఘా పెట్టారు. ఈ క్రమంలో నిబంధనలు అతిక్రమించి రవాణా అవుతున్న 37 లక్షల విలువగల నాలుగువేల లీటర్స్ మద్యం పోలీసులకు చిక్కింది. మొత్తం మూడు ప్రాంతాల్లో మద్యంతో పాటు నగదును పోలీసులు పట్టుకున్నారు.

**పట్టుబడిన మద్యం వివరాలు..**

బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న రూ.21,53,470 విలువగల 2597.88 లీటర్ల మద్యం పట్టుబడింది. బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పేట్ బషీరాబాద్ పీఎస్ ప్రాంతంలో నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న రూ.15,46,340 విలువగల 1916.2 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్‌వోటీ బాలానగర్ టీం, కేపీహెచ్‌బీ పోలీసులు రేడియంట్ మనీ లాజిస్టిక్ వాహనంలో నిబంధనలు అతిక్రమించి ఎటువంటి క్యూఆర్ కోడ్ లేకుండా తరలిస్తున్న రూ.1,24,626 నగదును పోలీసులు పట్టుకున్నారు.

# కేసులపై తగ్గేదేలే..




-మొదటి పేజి తరువాయి

ఆసిఫాబాద్ ప్రజలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తుందని చరిత్రను గుర్తు చేశారు. తెలంగాణ? అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలిచి ఉంటే అభివృద్ధికి మరింత అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాంతంలో కొమురంభీం ప్రాజెక్ట్ వట్టివాగు ప్రాజెక్ట్?లున్నా.. సాగు నీరొచ్చే దారి లేదన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టి ఉంటే నీళ్ల కష్టాలు ఉండేవి కావని తెలిపారు. ఈ ప్రాంతం నుండి సోయం బాపురావును మీరు గెలిపిస్తే బీజేపీ అధిష్టానం ఈ ప్రాంతానికి ఒక్క మేలు చేయలేదని.. అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కానీ కేంద్రంలో బీజేపీ కానీ ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. సోయం బాపురావుకు బీజేపీ మోసం చేసి ఈసారి టికెట్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కేసులపై సీఎం రేవంత్ కామెంట్స్ వీడియో..

మొట్టమొదటి సారి ఆదివాసీ ఆడబిడ్డ ఆత్రం సుగుణకు కాంగ్రెస్ అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఆత్రం సుగుణ టీచర్?గా పిల్లల మీద ఎంత ప్రేమ ఉందో వాళ్ల భవిష్యత్ మీద ఎంత ఆలోచన ఉందో ఎంపిగా అవకాశం ఇస్తే అంతే ప్రేమతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని సీఎం రేవంత్ తెలిపారు. ఆనాడు ఇందిరమ్మ.. ఇంట్లో ఉండే పేద ఆదివాసీ బిడ్డకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అసెంబ్లీలో కొట్లాడుతున్నడని.. ఆత్రం సుగుణకు పట్టం కడితే అంతే జోష్ తో మీ తరుపున పార్లమెంట్?లో గళం వినిపిస్తారన్నారు. నాకు ఆదిలాబాద్ అంటే ప్రత్యేక అభిమానం అన్నారు. ఈ ప్రాంతంలో బ్రిడ్జిలు, విద్యాలయాలు నిర్మించే బాధ్యత తనదని సీఎం రేవంత్ చెప్పారు. ఈ ప్రాంతంలో మూతపడిన సీసీఐని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. భారతదేశంలో బీజేపీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం కలిసి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 1881 నుండి ఆనాటి బ్రిటిషర్స్ జనాభా లెక్కలను చేపట్టారని తెలిపారు. ప్రతి పదేళ్లకు ఓ సారి దేశంలో జనాభాను లెక్క కట్టడం సంప్రదాయంగా మారిందన్నారు. అయితే 2021 నుండి జనాభాను బీజేపీ లెక్క కట్టలేదన్నారు. ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలను పడగొట్టి రిజర్వేషన్ల రద్దు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో 400 సీట్లు గెలిస్తే రిజర్వేషన్‌లు రద్దవుతాయని.. మీ ఓటుతో రిజర్వేషన్‌ను రద్దు చేయించుకుంటరా.. లేక రిజర్వేషన్ రద్దు చేద్దామంటున్న బీజేపీ ప్రభుత్వాన్ని రద్దు చేస్తరా ఆదిలాబాద్ ప్రజలు ఆలోచన చేయండన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సుగుణను గెలిపించాలని విజ్ఞప్తి

ఆదిలాబాద్ నుంచి తాము మహిళకు, సామాన్య ప్రభుత్వ ఉద్యోగికి ఎంపీ టిక్కెట్ ఇచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంత్రి సీతక్క రిక్వెస్ట్‌తో సోనియా గాంధీ ఆత్రం సుగుణ అనే ఆడబిడ్డకు టిక్కెట్ ఇచ్చారని తెలిపారు. మీ తరఫున సీతక్క ఉంటారని.. మీ తరపున సుగుణ నిలబడ్డారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సుగుణకు అందరూ ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆమెకు డబ్బులు ఉన్నాయని టిక్కెట్ ఇవ్వలేదని, చదువుకున్నారని, ఆదిలాబాద్ సమస్యలపై అవగాహన ఉందని ఇచ్చామన్నారు.

గురువారం ఆయన ఆసిఫాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోడు భూముల సమస్యపై కేసీఆర్ దృష్టి పెట్టలేదని ఆరోపించారు. ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి బీజేపీ కృషి చేయలేదన్నారు. కేంద్రమంత్రివర్గంలోనూ గోండులకు స్థానం దక్కలేదని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు గోండులు, లంబాడ హక్కులను కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు ఆదిలాబాద్ లోక్ సభ టిక్కెట్‌ను మహిళలకు ఇవ్వలేదన్నారు. కానీ కాంగ్రెస్ సామాన్య మహిళా ఉద్యోగికి టిక్కెట్ ఇచ్చిందన్నారు. గత లోక్ సభ ఎన్నికల్లో సోయం బాపురావును గెలిపిస్తే ఆదిలాబాద్‌కు చేసిందేమీ లేదన్నారు. చివరకు ఈ ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రస్తుత బీజేపీ అభ్యర్థి నగేశ్, బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు చేసిందేమీ లేదన్నారు. తుమ్మడిహట్టి ప్రాజెక్టును కేసీఆర్ నిర్లక్ష్యం చేశారన్నారు. సీసీఐ మూతపడితే కేసీఆర్, మోదీ పట్టించుకోలేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చాలా వనరులు ఉన్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తోందన్నారు. విద్యా, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 3 నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు.

## సంపాదకీయం

# కానరాని మీడియా స్వేచ్ఛ...

ఆఫ్రికాలోని చాలా దేశాల్లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు ఉండేవి. వాటికి నిరసనగా ఆఫ్రికన్ జర్నలిస్టులు 1991, ఏప్రిల్ 29 నుండి మే 3వ తేదీవరకు ఆఫ్రికాలోని నమీబియా దేశపు విండ్ హాక్ నగరంలో సమావేశం ఏర్పాటుచేసి, పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అనేక తీర్మానాలు వచ్చాయి. ఆఫ్రికన్ జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరపాలని 1993, డిసెంబరు నెలలో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్‌కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటించడం కూడా జరిగింది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీనపత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించటానికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను జరుపుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా రంగానికి కష్టకాలంలో ఉంది. మీడియాకు స్వేచ్ఛ ఎండ మావే అవుతున్నది. మే 3వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 16న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్సవాలు జరిపినా పరిస్థితులలో మార్పు రాక పోవడం విచారకరం. భారత స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకొనేవి. తరువాత దేశ మీడియాలో ఆగీత చెరిగి పోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే. కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడి దారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా పోతోంది. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ము కోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నిచడం కొనసాగుతున్నది. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు జరుగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరి ప్రయోజనాలను ఇంకొకరు కాపాడు కుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారంలో వున్నపుడు దానిని అడ్డుపెట్టుకొని లాభాలు సంపాదించటం, ప్రతిపక్షంలో వున్నపుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరుగుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆవైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేఛ్ఛ హరించుకు పోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నా యన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపు తున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాక పోవటం లేదా కనిపించీ కనిపించకుండా ఒక మూలన పడవేయటమో జరుగుతోంది. తమ విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్రకటనలు నిలిపి వేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డు కోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తు తున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్ధం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడు తున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసుకోలేని గందరగోళంలో జనాన్ని పడ వేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసేకుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో గోబెల్స్‌లు వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తిపోస్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమవంతు తోడ్పాడును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందర గోళానికి గురి అవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఏర్పడింది. ఆ రోజును జాతీయ పత్రికా దినంగా పాటిస్తూ 1997 నుంచి ప్రెస్ కౌన్సిల్ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. భారతదేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్ కౌన్సిళ్ళు ఉన్నాయి. అయితే భారతదేశ కౌన్సిల్‌కు ఉన్న ప్రత్యేకత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించే అవకాశం లభించడమే. స్వేచ్ఛాయుతమైన, జవాబుదారీ తనంతో కూడినదిగా మీడియా వుండాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఆచరణలో స్వేచ్ఛను హరించే వారిని, అడ్డగోలుగా వ్యవహరించే మీడియా సంస్థలనూ సరైన దారిలో పెట్టటం దాని లక్ష్యం. లక్ష్య సాధనకు ప్రెస్ కౌన్సిల్ పూర్తిగా అంకితం కావాలని ఆశిద్దాం.

# బయో ఫ్యూయెల్‌కు ప్రోత్సాహం ఏదీ?



మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్న మైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం.

కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళి మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది.

కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ళీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది.

భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె.

బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందు బాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది.

స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

# జకీర్ హుస్సేన్ విశిష్ట సేవలు

భారత దేశపు మొదటి ముస్లిం రాష్ట్రపతి, పదవిలో మరణించిన మొదటి భారత దేశ ప్రథమ పౌరులు జాకీర్ హుస్సేన్ (ఫిబ్రవరి 8, 1897 – మే 3, 1969). ఆయన మే 13 1967 నుండి మరణించినంత వరకు రాష్ట్రపతి పదవిలో ఉన్నారు. భారత 3వ రాష్ట్రపతి జాకీర్ హుసేన్ హైదరాబాదు (భారత దేశం)లో జన్మించారు. ఇతని తండ్రి పఖ్తూన్ జాతికి చెందిన వారు. అయన హైదరాబాదు నుండి ఉత్తరప్రదేశ్ లోని ఫరూఖాబాద్ జిల్లా ఖాయిమ్ గంజ్ కు వలస వచ్చారు. హుస్సేన్ ప్రారంభ ప్రాథమిక విద్య హైదరాబాద్‌లో పూర్త యింది. హుసేన్ ఇటావా (ఉత్తరప్రదేశ్) లోని 'ఇస్లామియా ఉన్నత పాఠశాల' లో చదువు కున్నారు. లక్నో విశ్వ విద్యాల యం క్రిస్టియన్ డిగ్రీ కాలేజీ నుండి ఎకనామిక్స్ లో పట్టభద్రు డయ్యారు. ఉన్నతవిద్య అలీఘర్ లోని ఆంగ్లో మహమ్మడన్ ఓరియంటల్ కాలేజిలో అభ్యసించారు. ఇచట విద్యార్థి సంఘ నాయకునిగా గుర్తింప బడ్డారు. 18 సంవత్సరాల వయస్సులో, అయన షాజహాన్ బేగంను వివాహం చేసుకున్నారు. జాకీర్ హుస్సేన్ 23 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందంతో అయన నేషనల్ ముస్లిం విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు. మొదట అలీఘర్లో 1920 అక్టోబర్ 29 శుక్రవారం స్థాపించ బడింది, తరువాత 1925 లో న్యూ ఢిల్లీ లోని కరోల్ బాగ్ కు మార్చబడింది. తరువాత మార్చి 1, 1935 న న్యూ ఢిల్లీలోని జామియా నగర్ కు మళ్లీ మార్చ బడింది. దీనికి జామియా మిలియా ఇస్లామియా (కేంద్ర విశ్వ విద్యాలయం) అని పేరు పెట్టారు. జాకీర్ విత్తశాస్త్రంలో పి.హెచ్.డి. చేసేందుకు, 'బెర్లిన్ విశ్వ విద్యాలయానికి (జర్మనీ) వెళ్ళారు. 1926 లో బెర్లిన్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. జర్మనీలో ఉన్నప్పుడు గాలిబ్ (1797–1868) జీవితగాథ, కవితా సంగ్రహాలను క్రోడీకరించారు. 1927 లో మూసివేతను ఎదుర్కొంటున్న జామియా మిలియా ఇస్లామియాకు నాయకత్వం వహించడానికి అతను భారత దేశానికి తిరిగి వచ్చాడు. భారత దేశానికి తిరిగి వచ్చి, జామియా మిల్లియా ఇస్లామియాకు ఇరవై ఒక్క సంవత్సరాలు ఆయన పదవిలో కొనసాగారు. మార్గ దర్శకులుగా మారారు. ముహమ్మద్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాల (ఇప్పుడు అలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం) వ్యవహారాల్లో ముఖ్యంగా చురుకుగా ఉన్నారు. మహమ్మద్ అలీ జిన్నా వంటి రాజకీయ ప్రత్యర్థుల ప్రశంసలను పొందారు. బ్రిటిష్ వారితో పోరాటానికి, మహాత్మా గాంధీతో చేతులు కలిపి, "బేసిక్ విద్య" పై కఠోర పరిశ్రమ చేశారు. భారతదేశంలో విద్యాభ్యుదయానికి శ్రమించారు. ఈ కాలంలో హుసేన్ ఉత్తమ దార్శనికుడిగా, భారత విద్యా విభాగ మార్గదర్శకునిగా గుర్తింపు పొందారు. తమ రాజకీయ ప్రత్యర్థియైన మహమ్మద్ అలీ జిన్నా చేత కూడా పొగడ బడ్డారు. తన వ్యక్తిగత సంపదనంతా భారతదేశానికి ధారబోసిన దేశ భక్తులు. భారత స్వాతంత్ర్యం తరువాత, అలీఘర్ ముస్లిం యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ పదవిని అంగీకరించారు. స్వాతంత్ర్యం వచ్చిన ప్రథమ దశలో విద్యార్థుల ఉద్యమాలను, ముఖ్యంగా అలీఘర్ లో, అదుపులో ఉంచుటకు, అయన నియామకం ఎంతో ఉపయోగ పడింది. వైస్ ఛాన్సలర్ పదవీకాలం ముగిసిన తరువాత 1956 లో పార్లమెంటు సభ్యునిగా నామినేట్ చేయ బడ్డారు. 1957 లో బీహారు గవర్నరుగా నియమింప బడి, పార్లమెంటుకు రాజీనామా చేశారు. బీహారు గవర్నరుగా 1957 నుండి 1962 వరకు సేవలందించిన తరువాత 1962 నుండి 1967 వరకు భారత ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించారు. తదనంతరం మే 13 1967 న భారత రాష్ట్రపతిగా ఎన్నుకో బడ్డారు. అయన ప్రథమ ఉపన్యాసంలో "మొత్తం భారత దేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం" అని పేర్కొన్నారు. తన అధ్యక్ష పదవీ కాలంలో, హుస్సేన్ హంగరీ, యుగోస్లేవియా, యుఎస్ఎస్ఆర్ మరియు నేపాల్ లకు నాలుగు దేశాలకు పర్యటించారు. 1969 మే 3 న అయన మరణించగా, న్యూ ఢిల్లీ లోని జామియా మిలియా ఇస్లామియా క్యాంపస్‌లో ఖననం చేశారు. అత్యల్పకాలం రాష్ట్రపతి పదవి నిర్వహించిన మొదటి వ్యక్తి. రాష్ట్రపతి పదవిలో ఉండగా మరణించిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. (ఇప్పటి వరకు ఇద్దరు రాష్ట్రపతులు పదవిలో ఉండగా మరణించారు – డా.జాకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ). ఈయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1963 లో 'భారతరత్న' పురస్కారాన్ని అందించింది.

# కొవిషీల్డ్ దుష్ప్రభావాలు

కోవిడ్ తర్వాత, వ్యక్తులు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి చనిపోయారని మనమందరం వినే ఉంటాం. ఈ తీవ్రమైన సమస్యను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. కానీ తాను రూపొందించిన కోవిడ్ వ్యాక్సిన్ రక్తం గడ్డకట్టడానికి కారణమవుతోందని బ్రిటిష్ ఫార్మా దిగ్గజం ఆస్ట్రాజెనెకా తాజాగా బ్రిటిష్ న్యాయస్థానం ముందు అంగీకరించింది. ఈ వార్త వెలుగులోకి రావడంతో ప్రపంచవ్యాప్తంగా ఈ టీకా తీసుకున్న వారిలో భయం మొదలైంది. కొవిషీల్డ్ వ్యాక్సిన్ మరణాలకు కారణమైందన్న ఆరోపణలపై క్లాస్ యాక్షన్ దావాను ఆస్ట్రాజెనెకా ఎదుర్కొంటోంది. ఈ టీకాను తీసుకున్న రోగులలో రక్తం గడ్డకట్టడానికి సంబంధించిన అనేక కేసులు వెలుగులోకి వచ్చాయి. సంచలనం కలిగించిన ఈ ప్రకటన కోవిడ్ వ్యాక్సిన్ నాణ్యతపై గత నాలుగేళ్లుగా శాస్త్ర ప్రపంచం సంధిస్తున్న ప్రశ్నలను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. కానీ వాక్సిన్ కంపెనీ మాత్రం కోవిడ్ వ్యాక్సిన్ దుష్ప్రభావాలు అరుదుగా మాత్రమే సంభవిస్తాయని పేర్కొంది. యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్, బ్రిటిష్–స్వీడిష్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఆస్ట్రాజెనెకా సహకారంతో కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ని అభివృద్ధి చేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని పరిశోధకులు చాలా సంవత్సరాలుగా అడెనోవైరస్ వెక్టర్‌లను ఉపయోగించి వ్యాక్సిన్ ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. కోవిడ్ -19 మహమ్మారి విజృంభించినప్పుడు, వారు కరోనా వైరస్‌కి వ్యతిరేకంగా వ్యాక్సిన్‌ను రూపొందించారు. ఆ కోవిడ్–19 టీకానే తీవ్రమైన మరణాలకు కారణమైందని ప్రస్తుతం తేలింది. కోవిడ్ మహమ్మారి నియంత్రణ కోసం 2021లో తొలిసారిగా రూపొందించిన ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్, భారతదేశంలో కొవిషీల్డ్ అనే పేరుతో బహుళ గుర్తింపు పొందింది. కానీ ఈ వ్యాక్సిన్‌పై చాలా సంవత్సరాలుగా పరిశీలన జరుగుతోంది. వాస్తవానికి, అనేక దేశాలు 2021లోనే దీనిని నిషేధించాయి. కారణం ఈ వ్యాక్సిన్ కలిగించే దుష్ప్రభావాలు ప్రాణాంతకంగా మారగలవని ప్రచారం జరగడమే. 2020ల మొదట్లో ప్రపంచవ్యాప్తంగా కోవిడ్–19 మహమ్మారి విజృంభించినప్పుడు రోజువారీగా ప్రపంచంలో వేలాది మరణాలు సంభవిస్తూ భయోత్పాతం కలిగిస్తున్న కొన్ని నెలల వ్యవధిలోనే కోవిడ్–19 వ్యతిరేక వ్యాక్సిన్ కనుగొన్నారు. ప్రపంచమంతటా దీన్ని ప్రజలకు అందించారు. కానీ ఇంత హడావుడిగా, నమ్మశక్యం కానంత వేగంగా రూపొందించిన కోవిడ్ వ్యాక్సిన్ పంపిణీపై పలువురు శాస్త్రజ్ఞులు అప్పట్లోనే సందేహాలు వెలిబుచ్చారు. బిలియన్ల కొద్దీ ప్రజలు తీసుకున్న ఈ వ్యాక్సిన్ కీలకమైన భద్రతా మార్గదర్శకాలను విస్మరించిందన్న విమర్శలు వచ్చాయి.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



# స్థానిక వార్తలు

## బంధం విజయలక్ష్మి దిశదినకర్మకు హాజరైన వాసి రెడ్డి రామనాథం



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో మాజీ మధిర మార్కెట్ చైర్మన్ బంధం శ్రీనివాసరావు సతీమణి విజయలక్ష్మి దశ దిన ఖర్మ సందర్భంగా తెలుగుదేశం పార్టీ తెలంగాణా రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షులు రామనాథం విజయలక్ష్మి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బోనకల్ టీడీపీ, పార్టీ మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, ముష్టికుంట్ల గ్రామ శాఖ అధ్యక్షులు బంధం హుస్సేన్, మండల ఉపాధ్యక్షులు బంధం రంగయ్య, మండల అధ్యక్షులు బంధం అనిల్ కుమార్, సంఘారపు బుచ్చిబాబు, జడ్ల కృష్ణ, దుగ్గి భద్రయ్య, నాయకులు సంగరపు. శ్రీనివాసరావు, నల్లమోతు నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపు లక్ష్యంగా అశ్విన్ రెడ్డి ప్రజా యాత్ర



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మండలంలోని పలు గ్రామాలలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణక్క గెలుపు కోసం ప్రజా యాత్ర పేరుతో ఏలేటి అశ్విన్ రెడ్డి చేపట్టిన కార్యక్రమం మండలంలోని వైజాపూర్ గ్రామంలో కుంరం భీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా ప్రారంభించారు. గ్రామస్తులు అశ్విన్ రెడ్డిని డోలు వాయిద్యాలు, మంగళ హారతులతో ఘనంగా గ్రామంలోకి స్వాగతించినారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో చుట్టుపక్కల గల పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. తదనంతరం మండలంలోని వివిధ గ్రామాలైన కమలాపూర్, సీతాగొంది, దాజితాండ, మచ్చాపూర్ గ్రామాలలో గడప గడపకు ప్రచార కార్యక్రమాన్ని కోవ దౌలత్ రావు మోకాశీ తో కలసి కొనసాగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ మడావి లక్ష్మణ్, మహాజన్ ఆనంద్ రావు, మాజీ సర్పంచ్ సిడం లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ కుమ్ర బీర్ షావ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆడే శీల, ఎంపీటీసీ అంకత్ రవి, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కరుణాకర్, మండల వైస్ ప్రెసిడెంట్ ఆషిఫ్ ఖాన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నరేష్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్లు ఎంపీటీసీలు మాజీ ఎంపీటీసీలు కిసాన్ సెల్ ఎస్సీ సెల్ బీసీ సెల్ యూత్ కాంగ్రెస్ నాయకులు గాజుల పోతన్న, భాస్కర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రాం లక్ష్మణ్ గౌడ్, నరేష్ రెడ్డి, పాల్గొన్నారు.

## నేతకాని కుల దృవీకరణ పత్రం అచ్చు తప్పులను సరిచేయడం పట్ల సంబరాలు



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పది సంవత్సరాలుగా నేతకాని కుల ధ్రువీకరణ పత్రం ఆన్లైన్లో నేత్కాని గా వచ్చేదని తెలంగాణ నేతకాని (మహర్) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేసిన పోరాటం వల్ల నేతకాని అని కుల దృవికరణ పత్రం ఆన్లైన్ ద్వారా రావడం యావత్ నేతకాని సమాజ విజయమని తెలంగాణ నేతకాని (మహర్) సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి రవీందర్ అన్నారు. ఆన్లైన్లో నేత్కాని అనే పదాన్ని మార్చి నేతకాని కుల ధ్రువీకరణ పత్రం వస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం నేతకాని సంఘం నాయకులు స్థానిక బస్టాండ్ వద్ద గల భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బండారి రవీందర్ నేతకాని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కులం పేరు తప్పుగా రావడంతో గత పది సంవత్సరాల కారణంగా విద్యార్థులు ఉద్యోగార్థులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు జాతీయ స్థాయిలో యూనివర్సిటీలో ప్రవేశాల కోసం,ఉద్యోగాల కోసందరఖాస్తు చేసుకున్న నేతకాని విద్యార్థులకు జాతీయ గెజిట్లో నేతకాని అని కులం పేరు ఉండడంతో వారి దరఖాస్తులు ఎన్నోసార్లు తిరస్కారాలు గురై తీవ్ర ఇబ్బందుల్లో ఎదుర్కొన్నారని అన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ నేతకాని (మహర్)సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాశి రాజేష్ అద్వర్యంలో రాష్ట్ర కార్యవర్గం అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు కేంద్ర,రాష్ట్ర స్థాయి ఎస్సీ కమిషన్ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లడంతో పాటు కుల ధ్రువీకరణ పత్రంలో తప్పు సవరణకు తీవ్ర ప్రయత్నాలు చేశారని అన్నారు. కుల ధ్రువీకరణ పత్రంలో తప్పు సవరించడం ద్వారా కుల బాంధవులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని అన్నారు. రాబోయే కాలంలో నేతకానికి కులస్తులకు దక్కాల్సిన హక్కులను దక్కేన పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. సంఘం ఆదిలాబాద్ జిల్లా యువత అధ్యక్షుడు జునుగురు మహేష్, సభ్యులు బోర్లకుంట రాజేందర్,జునుగురు రమేష్ బోర్లకుంట రాజేశ్వర్,కొండగొర్ల ప్రేమ్ సాగర్,పెరుగు నరేష్,జాడి రాజేశ్వర్,బోర్లకుంట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మకాంటకు దరిచేరని ఇసుక లారీలు





- అసలు తగ్గేదేలే అంటూ యదెచ్చేగా ఇసుక అక్రమ రవాణా
- బడా బాబుల చేతిలో మంజీరా
- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- కనీస నియమాలు పాటించని క్వారీ యజమానులు
- మట్టిని కూడా మట్టు పెడుతున్న బడాబాబులు
- ప్రభుత్వ అండదండలతో మూడు పూలు ఆరు కాయలుగా వ్యాపారం..

**వాస్తవ నేస్తం,జుక్కల్ (బిచ్కుంద):** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పటయ్యాక 2014 వ సంవత్సరం అక్టోబర్ 8న నూతనంగా తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇసుక విషయంలో తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానం తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనే ఇసుకను విక్రయించేలా, దళారులను ఆచరించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే ఇంటికి ఇసుకను తీసుకువచ్చేలా ప్రణాళికను రూపొందించింది. తెలంగాణ రాష్ట్రంలో 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటామని, దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి ప్రభుత్వ ఖజానాను కాపాడుతామని గొప్పలు చెప్పుకున్న నాయకులు ఇవాళ చూసి చూడనట్టుగా వ్యవహరిస్తుండడంతో అక్రమ ఇసుక రవాణదారులు అసలు తగ్గేదేలే అంటూ యదెచ్చేగా రోజుకు వందల వాహనాలలో కనీస ప్రభుత్వ నియమాలు పాటించకుండా, అధిక లోడులతో ఇసుకను తరలిస్తూ ప్రభుత్వానికి ఇటు రైతాంగానికి గండి కొడుతున్నారు. మొదటికే మోసం అంటూ లారీలో ఇసుక లోడ్ అయ్యాక ధర్మకాంట కు దరిదాపుల్లో వెళ్లకుండా నేరుగా ఇసుక తరలించడంపై ప్రభుత్వ శాఖ యంత్రాంగం ఎందుకు దృష్టి సారించలేకపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. పట్టపగలే మంజీరాను కొల్లగొడుతున్న యదేచ్ఛగా ఇసుక తరలి పోవడంపై ప్రభుత్వంలోని మైనింగ్, పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖ అధికారుల పని తీరు అద్దం పడుతుంది. ఏ రోజు కూడా ఇసుక లారీలపై ఈ అధికారులు నిగా పెట్టలేదని మామూళ్లతోనే సరిపెట్టుకొని నెట్టుకు వస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అక్రమంగా తరలిస్తున్న ఇసుకను నియంత్రించి, అధిక లోడుతో వెళుతున్న లారీలపై నిఘ పెట్టి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వంతెన నిర్మించారు రోడ్డు మరిచారు

## సరైన రోడ్డు లేకపోవడంతో వాహనదారుల ఇక్కట్లు





**వాస్తవ నేస్తం,జుక్కల్ (బిచ్కుంద):** జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలోని శెట్లూర్, ఖత్గావ్ గ్రామాల మధ్యలో గల మెక్క వాగుపై నిర్మించిన వంతెన నెలలు గడుస్తున్న వంతెనకు ఇరువైపులా తాత్కాలికంగా మొహరంతో రోడ్డును నిర్మించడంతో వాహనదారులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. బిచ్కుంద మరియు బీర్కూరు మండలాల నుండి డోంగ్లి మండలానికి వెళ్లే ముఖ్యమైన రహదారి అవ్వడంతో ఈ రహదారి గుండా రోజుకు వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగించలేకపోయేవారు. వంతెన నిర్మించి నెలలు గడుస్తున్న వంతెనకు ఇరువైపులా రోడ్డు నిర్మించకపోవడంతో వచ్చే వాన కాలంలో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆర్ అండ్ బి శాఖ అధికారి ఏఈ వినోద్ ని వాస్తవ నేస్తం పత్రిక విలేఖరి ఫోన్లో వివరణ కోరగా వంతెన నిర్మించిన కాంట్రాక్టర్కు ప్రభుత్వం డబ్బులు చెల్లించడంలో జాప్యం జరగడం వల్ల రోడ్డు పనులు నిలిచిపోయాయని, ఎట్టి పరిస్థితులలో వచ్చే వర్షాకాలం నాటికి ఈ పనులు పూర్తి చేస్తామని ఆర్ అండ్ బి అధికారి ఏఈ వినోద్ తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**– కలెక్టర్ క్రాంతి వల్లూరు**




**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ హక్కును ఎన్నికల సంఘం కల్పించిందని జిల్లా కలెక్టర్ కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. ఈ నెల నాలుగు నుండి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగానున్నట్లు తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని ఎన్ఐసి కార్యాలయంలో జహీరాబాద్ మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కేటాయింపులు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుగుణం గా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. జహీరాబాద్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆయా ఆర్డీవో కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ సెంటర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఓటు వేసే సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. ఆదివారం కూడా ఈ సెంటర్లు పనిచేస్తాయి అన్నారు.

**రెండవ రాన్ డమైజేషన్ ప్రక్రియ పూర్తి..**


జిల్లాలో రెండవ రండైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాలో మొత్తం 2885 ఈవీఎంల వి వి పాట్ ల రెండవ రాండమైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. వీటిని రేపు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపినట్లు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. నారాయణఖేడ్ లో 298 , అందోల్ లో 313 జహీరాబాద్ 313 సంగారెడ్డి 281 పటాన్చెరువు 411, మెదక్ 3 జహీరాబాద్ 2లో బీయులు అదనంగా ఉండడం వలన మొత్తం జిల్లాలో 2885 ఈవీఎంలు వివి పేట్ల రాండమైజేషన్ పూర్తిచేసి ఆయా నియోజకవర్గ కేంద్రాలకు పంపినట్లు తెలిపారు. రెండవ రాండమైజేషన్ ప్రక్రియ మొత్తం వివిధ పార్టీల రాజకీయ నాయకుల సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జైనులు అక్షయ తృతీయ ప్రాముఖ్యత



హిందూ మతంలో, వైశాఖ మాసంలోని శుక్ల పక్షం మూడవ రోజున అక్షయ తృతీయ పండుగను చాలా ఉత్సాహంగా జరుపుకుంటారు. అక్షయ తృతీయ పండుగను హిందూ మతం మాత్రమే కాకుండా జైన మతం ప్రజలు కూడా జరుపుకుంటారు. అయితే జైనమతంలో అక్షయ తృతీయ పండుగను జరుపుకునే సంప్రదాయం, ప్రాముఖ్యత పూర్తిగా భిన్నంగా ఉంటుంది. జైనమతంలో ఇది శ్రమనా సంస్కృతితో యుగానికి నాందిగా పరిగణిస్తారు. జైనమతం ప్రకారం భారత ప్రాంతంలో యుగం మార్పు భోగభూమి, కర్మభూమి రూపంలో జరిగింది. భోగ్ భూమిలో వ్యవసాయం లేదా పని అవసరం లేదు. అందులో కల్పవృక్షాలు ఉన్నాయి. వాటి ద్వారా మనుషులు కోరుకున్న వస్తువులను పొందుతాడు. జైనమతంలో, అక్షయ తృతీయను దాతృత్వానికి, పుణ్యం సంపాదించడానికి అత్యంత పవిత్రమైన తేదీగా పరిగణిస్తారు. ఈ తేదీన దానం చేయడం వల్ల పంట చెడిపోదని నమ్ముతారు. ఈ రోజున గంగాస్నానం చేయడం, పూర్వీకులకు నైవేద్యాలు సమర్పించడం, పేదలకు అన్నదానం చేయడం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయని నమ్ముతారు. జైన మతం నమ్మకం ప్రకారం, లార్డ్ రిషభనాథ్ (మొదటి తీర్థంకరుడు) ఒక సంవత్సరం పాటు తపస్సు చేసిన తర్వాత, వైశాఖ మాసం శుక్ల పక్షంలోని తృతీయ తిథి నాడు అంటే అక్షయ తృతీయ రోజున ఇక్షు రాస్ (చెరకు రసం)తో తపస్సు పూర్తి చేశాడు. ఈ కారణంగా జైన సమాజంలో ఈ రోజు ప్రత్యేకంగా పరిగణిస్తారు. ఈ నమ్మకం కారణంగానే హస్తినాపూర్‌లో నేటికీ అక్షయ తృతీయ వ్రతం చెరుకు రసంతో విరమిస్తారు. ఇక్కడ ఈ పండుగను పారన్ అని పిలుస్తారు. హిందూ మతం అనుచరులు రిషభనాథుడిని విష్ణువు అవతారంగా భావిస్తారు. జైనమతం విశ్వాసాల ప్రకారం, జైనమతంలో అక్షయ తృతీయ నాడు విరాళానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ మతంలో ఆదినాథ భగవానుడే సమాజంలో దాన ధర్మానికి గల ప్రాధాన్యతను వివరించి దాన ధర్మాన్ని ప్రారంభించాడు. ఆదినాథుడు తన రాజ్యాన్ని వదిలి తపస్సు చేయడానికి అడవికి వెళ్ళాడు. అక్కడ 6 నెలలపాటు నిరంతరం తపస్సు చేశాడు. 6 నెలల తరువాత, ఈ సంఘానికి దాన ధర్మం గురించి వివరించాలి అని భావించి, అతను జాగ్రత్తగా లేచి, తినే భంగిమను ధరించి, నగరం వైపు బయలుదేరాడు. జైనమతంలో, అక్షయ తృతీయ రోజున, ప్రజలు అన్నదానం చేస్తారు. జ్ఞానదానం చేస్తారు, ఔషధాలను దానం చేస్తారు లేదా దేవాలయాలలో దానం చేస్తారు. ఆదినాథ భగవానుడు అసి-మసి-కృషి గురించి ఈ ప్రపంచానికి చెప్పాడని జైనమతం నమ్ముతుంది. సరళమైన భాషలో అర్థం చేసుకుంటే, అసి అంటే కత్తి, మాసి అంటే సిరాతో రాయడం, వ్యవసాయం అంటే వ్యవసాయం. ఆదినాథ భగవానుడు స్వయంగా ఈ శాస్త్రాలను ప్రజలకు వివరించి, జీవించడం కోసం వాటిని నేర్చుకోమని సలహా ఇచ్చాడు. జీవితంలో విద్య ప్రాముఖ్యతను తన కుమార్తెలకు మొదటగా బోధించినది ఆదినాథ భగవానుడే అని చెబుతారు.

# ఇక్కడ జంతువులకు పీరియడ్స్ వస్తాయంట!



మహిళలకు పీరియడ్స్ అనేది సహజం. అమ్మాయిలకు ఒక ఏజ్ వచ్చాక వారికి పీరియడ్స్ అనేవి వస్తాయి. ఇక ఈ సమయంలో వారు మానసికంగా, శారీరకంగా చాలా సమస్యలను ఎదుర్కొంటారు. అయితే చాలా మంది మెన్సెస్ అనగానే ఈ సమస్య అమ్మాయిలకు మాత్రమే ఉంటుందని భావిస్తారు. కానీ కొన్ని రకాల జంతువులు, క్షీరదాలకు కూడా పీరియడ్స్ వస్తాయంట. ఏంటీ ఆడవారికే కాకుండా జంతువులకు కూడా రుతుక్రమం అనేది ఉంటుందా అని ఆలోచిస్తున్నారా.. కానీ ఇదే నిజం అంటుంది డిస్కవర్ వైల్డ్ లైఫ్..అది చేసిన ఓ అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడైనట్లు వారు పేర్కొన్నారు. కాగా, ఏ జంతువులు, క్షీరదాలకు పీరియడ్స్ వస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం. తాజాగా డిస్కవర్ వైల్డ్ లైఫ్ కొన్ని క్షీరదాలు, జంతువులకు మనుషులలానే పీరియడ్స్ వస్తాయని తెలిపింది. గబ్బిలాలు,ష్రూలు, ఎలుకలుకు రుతుస్రావం వస్తుందంట కానీ ఇది వారిలో ప్రతి 33 రోజులకు ఒకసారి వస్తుందని చెప్తున్నారు. అదే విధంగా, కోతి కుంటుంబానికి చెందిన బాబూన్‌లకు ఆడవారిలానే పీరియడ్స్ వస్తుంటాయంట, కాకపోతే వీటికి ప్రతి 33 రోజులకు ఒకసారి పీరియడ్ వస్తుందని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా, పశ్చిమాసియా దేశాలలో కనిపించే రీసస్ మకాక్ కోతులు, అదే వింధంగా ఆడ చింపాజీలకు ప్రతి 28 రోజులకు ఒకసారి పీరియడ్స్ వస్తుందంట.అయితే ఈ చింపాజీలకు 60 సంవత్సరాల వరకు రుతుక్రమం అనేది కొనసాగుతూ ఉంటుంది. ఇలా ఈ జంతువులు, క్షీరదాలు ఆడవారిలానే పీరియడ్స్ అనే సమస్యను కలిగి ఉంటాయంట.

# పాదాలకు డిటాక్స్ చేయాలనుకుంటున్నారా



డిటాక్స్ అంటే శరీరంలోని టాక్సిన్‌లను తొలగించడం. అందుకే చాలామంది వ్యక్తులు చర్మాన్ని డిటాక్స్ చేసుకుంటూ ఉంటారు. అంటే చర్మంలో ఉండే మలినాలు, విషపూరిత పదార్థాలు, దుమ్ము, మృతచర్మ కణాలను తొలగిస్తారు.దీని వల్ల మీ చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖం మెరుపును కూడా కాపాడుతుంది. అదేవిధంగా, పాదాలను జాగ్రత్తగా చూసుకోవడం, వాటిని డిటాక్స్ చేయడం చాలా ముఖ్యం.ఈ సీజన్‌లో చెమట, దుమ్ము కారణంగా, పాదాల నుండి దుర్వాసన, మడమలు పగిలిన సమస్య ఉంటుంది. అదే సమయంలో ఎక్కువ సేపు నిలబడి పని చేయడం, అటూ ఇటూ పరిగెత్తడం, ఎక్కువ ప్రయాణం చేయడం వల్ల పాదాలు వాచి నొప్పులు మొదలవుతాయి. దీని కోసం, పాదాలను డిటాక్స్ చేయడం చాలా మంచిదని భావిస్తారు. వేసవిలో పాదాలను శుభ్రం చేసుకుంటే సరిపోదు. వాస్తవానికి, మీరు వారానికి ఒకసారి ఫుట్ డిటాక్స్ కూడా చేయాలి. మీరు పార్లర్‌కు వెళ్లడం ద్వారా కూడా దీన్ని పూర్తి చేయవచ్చు. అలాగే, ఇంట్లో లభించే కొన్ని వస్తువులతో మీ పాదాలను డిటాక్స్ చేసుకోవచ్చు. ఇంట్లో మీ పాదాలను డిటాక్స్ చేయడానికి, ఒక టబ్‌లో గోరువెచ్చని నీటిని తీసుకుని, అందులో రెండు చెంచాల యాపిల్ సైడర్ వెనిగర్, 2-4 చుక్కల ఎసెన్షియల్ ఆయిల్, సీ సాల్ట్ వేసి బాగా కలపాలి. ఇప్పుడు మీ పాదాలను 10 నుంచి 20 నిమిషాల పాటు ఉంచండి. ఇప్పుడు టవల్ సహాయంతో తుడిచి, ఆపై పాదాలకు మాయిశ్చరైజర్ రాయండి. కావాలంటే దీనికి ముందు లైట్ స్క్రబ్ కూడా చేసుకోవచ్చు. డెడ్ స్కిన్ సెల్స్ తొలగించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ఇది కాకుండా, మీరు గోరువెచ్చని నీటిలో రాక్ సాల్ట్ వేసి, ఆ నీటిలో మీ పాదాలను ముంచి, వాపు, నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు. ఫుట్ డిటాక్స్ పాదాలను శుభ్రపరచడంలో మాత్రమే కాకుండా నొప్పి, వాపు నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. మీరు బాగా అలసిపోయినట్లు అనిపిస్తే, మీ పాదాలను వేడి నీటిలో నానబెట్టడం వల్ల మీరు రిలాక్స్‌గా ఉండగలుగుతారు. అలాగే, రాత్రిపూట ఫుట్ డిటాక్స్ చేయడం కూడా మీ నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. దీనితో పాటు, ఫుట్ డిటాక్స్ సమయంలో పాదాలకు మసాజ్ చేస్తే, అది రక్త ప్రసరణను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. అలాగే, వేసవి కాలంలో, చెమట కారణంగా పాదాలు దుర్వాసన రావడం ప్రారంభిస్తాయి. దీని కారణంగా పాదరక్షలు కూడా వాసన పడటం ప్రారంభిస్తాయి. కానీ ఫుట్ డిటాక్స్ చేయడం వల్ల ఈ సమస్య నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు.

# ఈ రాశుల వారు ప్రేమకి దూరంగా ఉండటమే మంచిది



ఏదైనా సంబంధంలో చిన్న చిన్న విభేదాలు వస్తాయి. అయితే కొందరి మధ్య తరచూ గొడవలు జరుగుతుంటాయి. వివిధ రాశు ల మధ్య అసమ్మతిని నిర్ణయించడంలో జ్యోతిషశాస్త్రం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మనకి తెలియని విషయం ఏమిటంటే.. మనం ఎంత ప్రయత్నించిన కొన్ని బంధాలను అసలు కాపాడుకోలేము.. దీనికి కారణం ఇద్దరి రాశిచక్ర గుర్తుల స్థానం అని కూడా చెప్పవచ్చు. అయితే జ్యోతిష్యం, ఈ రాశుల వారు ప్రేమకి దూరంగా ఉండటమే మంచిదని చెబుతుంది. వారు ప్రేమించిన వారితోనే నిత్యం గొడవలు అవుతూనే ఉంటాయని అంటున్నారు. ఆ రాశుల జంటలేవో ఇక్కడ తెలుసుకుందాం.. కర్కాటకం, మకరం : కర్కాటక రాశి వారు చిన్న చిన్న విషయాలకే ఫీల్ అవుతుంటారు. మరో వైపు మకరం రాశి వారు నిర్లక్ష్యం చేస్తుంటారు. ఎదుటి వాళ్ల గురించి ఎక్కువ ఆలోచించరు. వారి అవసరాలు ఉన్నంత వరకే మనుషులతో మాట్లాడతారు. ఇది కర్కాటక రాశి వారికి అసలు నచ్చదు. దీని వల్ల ప్రేమలో ఉన్నవారు ఎప్పుడూ గొడవలు పడుతూనే ఉంటారు.సింహం, వృశ్చికం : సింహరాశి వారు మర్యాదను కోరుకుంటారు. వృశ్చిక రాశి వారు అన్ని విషయాలను లైట్ తీసుకుంటారు. అలాగే ఎవరైనా ఎదుగుతున్నా చూసి అసలు తీసుకోలేరు. వీరి మధ్య ప్రేమ కాదు కదా.. స్నేహం కూడా కష్టమే. ప్రేమ, రిలేషన్‌పై వారి విభిన్న విధానాల విభేదాలకు దారి తీయవచ్చు. కన్య, ధనుస్సు :కన్య రాశి వారు అన్ని ఆలోచిస్తారు. స్పాంటేనిటీ కోరుకునే ధనుస్సు రాశి వారితో విభేదాలు ఎక్కువ ఉంటాయి. ధనుస్సు రాశిని చాలా నిర్లక్ష్యం చేస్తారు. వీరిద్దరి ఆలోచనలు ఎప్పటికి కలవలేవు. వీరి ప్రేమ సంబంధాలపై అపార్థాలకు దారితీయవచ్చు.

# నడుము నొప్పి వేధిస్తోందా?



ప్రస్తుతం అనేక మందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో నడుము నొప్పి ఒకటి. మారుతున్న జీవన శైలి, తరచుగా కూర్చోవడం, లేవడం వంటి పనుల్లో నిమగ్నం కావడం, ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం, సరైన భంగిమలో పడుకోకపోవడం, శారీరక బలహీనత, ఆహారపు అలవాట్లలో మార్పులు ఇందుకు కారణం అవుతున్నాయి. ఒకప్పుడు నడీడు వయసు దాటాకే బ్యాక్ పెయిన్స్ వచ్చేవి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. వయస్సుతో సంబంధం లేకుండా అందరినీ ఎవరిలోనైనా ఇది వచ్చే చాన్సెస్ ఉన్నాయి. అయితే ఈ నొప్పి రాకుండా ఏం చేయాలి? మందులు, చికిత్స లేకుండానే సమస్య నుంచి ఎలా బయటపడాలి? నడుము నొప్పి నుంచి ఉపశమనానికి వ్యాయామం చక్కటి పరిష్కారమని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే ఎక్సర్ సైజ్ వల్ల కండలు, ఎముకలు దృఢంగా తయారవుతాయి. డైలీ అరగంట వివిధ వ్యాయామాలు లేదా శారీరక శ్రమ కలిగి ఉంటే వెన్ను నొప్పి సహజంగానే రాదు. వచ్చినా ఒకటీ రెండు రోజుల్లో తగ్గిపోతుంది. అయితే నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు బాడీ ఫ్లెక్సిబుల్‌గా ఉంటుంది కాబట్టి ఫిట్‌నెస్ ట్రైనర్ లేదా ఫిజియో థెరపిస్ట్ సలహా మేరకు వ్యాయామం చేయడం మంచిది. వెన్ను లేదా నడుము నొప్పికి సరైన భంగిమలో కూర్చోకపోవడం కూడా కారణం కావచ్చు. కాబట్టి కూర్చునేటప్పుడు, లేచేటప్పుడు, నిద్రపోతున్నప్పుడు సరైన పొజిషన్‌లో ఉండేలా జాగ్రత్త పడాలని నిపుణులు సూచిస్తున్నారు. స్ట్రెయిట్‌గా కూర్చోవడం, షోల్డర్స్‌ను నిటారుగా ఉంచడం, కంఫర్టబుల్ చెయిర్‌ను యూజ్ చేయడం, బరువైన వస్తువులు ఎత్తేటప్పుడు, మెట్లపై నడిచేటప్పుడు సరైన టెక్నిక్స్ పాటించడం నడుము నొప్పి నివారణ చర్యలుగా ఉపయోగపడతాయి. దీంతోపాటు నొప్పి నుంచి ఉపశమనానికి హాట్ అండ్ ఐస్ వాటర్ థెరపీని ప్రయత్నించవచ్చు. గోరు వెచ్చని లేదా చల్లటి నీటితో స్నానం చేయడం, కంప్రెస్ చేయడం వల్ల కండరాలు రిలాక్స్ అయి నొప్పి తగ్గుతుంది. అయినా తగ్గకపోతే వైద్య నిపుణులను సంప్రదించాలి.

## బీఆర్ఎస్ అభ్యర్థిని ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపిద్దాం

**బిఆర్ఎస్ మాజీ జెడ్పి చైర్మన్‌లోల శ్యాంసుందర్**



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. గురువారం లోకేశ్వరం మండలం కనకాపూర్, అబ్దుల్లాపూర్, జోహార్పూర్, గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటేసి మోసపోవద్దని అన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రైతుల పాలిట శాపంగా మారిన ప్రభుత్వా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మాయమాటలు చెప్పి ప్రజల్ని మోసం చేస్తుందని మళ్లీ మోసపోతే గోసా పడతామని అన్నారు,ఈ కార్యక్రమంలో మాజీ అబ్దుల్లాపూర్ ఎంపిటిసి భోజారం, బి ఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, బి ఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దిగంబర్,ఓంకార్ దేవేందర్,గోపు చిన్నయ్య,ఉప సర్పంచ్ ముస్తఫా, బిఆర్ఎస్ నాయకులు దేవేందర్, ప్రకాష్,సాయ రెడ్డి,సంజీవ్, భోజా రెడ్డి,చింట్టు మహేష్, నందు పటేల్,బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంజన్నకు ఆస్తిని రాసేసిన తండ్రి

**మెదక్ :** టెక్నాలజీ ఇంత అభివృద్ధి చెందుతూ, రోజురోజుకూ ఓ మెట్టు ఎదుగుతున్న ప్పటికీ.. మరోవైపు మానవ సంబంధాలు అంతకు మించి ప్రభావితం అవుతున్నాయి. బంధువులు, స్నేహితులను కాదు కదా, రక్త సంబంధం ఉన్న వారిని సైతం కొందరు పట్టించుకోవడం లేదు. పిల్లల కోసం తన జీవితం మొత్తం ధారపోస్తే, వాళ్లు మాత్రం తల్లిదండ్రుల్ని సరిగ్గా చూసుకోవట్లేదు. దీంతో మనస్తాపం చెందిన ఓ తండ్రి యావదాస్తిని తన కుమారులకు చెందకుండా దేవుడికి సమర్పించారు. తెలంగాణలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.బాలయ్య అనే వ్యక్తి స్వస్థలం సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం అలీపూర్. అసలే వయసు మీద పడటంతో కొడుకులు తనను ప్రేమగా చూసుకుంటున్నారని, పట్టెడన్నం పెడతారని భావించారు. కానీ అలా జరగటం లేదు. ఎంతో ప్రయోజకులై తనను బాగా చూసుకుంటారని భావించిన తండ్రి బాలయ్యకు నిరాశే ఎదురైంది. తండ్రికి సరిగ్గా అన్నం పెట్టడానికి, బాగోగులు చూసుకోవడానికి నువ్వంటే నువ్వు అని కొడుకులు అంటున్నారు. ఆస్తిలో వాటాకు మాత్రం రెడీగా ఉంటున్నారు. తన కొడుకులు అన్నం పెట్టట్లేదని, సరిగా చూసుకోవట్లేదని మనస్థాపానికి బాలయ్య గురయ్యారు. దాంతో జీవితాంతం తాను కష్టపడి కొడుకుల కోసం సంపాదించిన తన యావదాస్తిని కొండగట్టు అంజన్నకు కానుకగా సమర్పించారు. మొదట తన నిర్ణయం ప్రకారం.. కొండగట్టు అంజన్న సన్నిధికి చేరుకున్నారు బాలయ్య. తన వెంట తీసుకొచ్చిన ఆస్తికి సంబంధించిన పత్రాలను కొండగట్టుదేవస్థానంలోని హుండీలో వేయానికి సిద్ధమయ్యారు. ఆలయం హుండీలో వేస్తే ఆ ఆస్తి పత్రాలు వేస్తే అంజన్నకి చెల్లదని చివరి నిమిషంలో పూజారులు చెప్పారు. దాంతో, తన ఆస్తిని కొండగట్టు అంజన్న పేరుతో పట్టా చేస్తానని బాలయ్య తెలిపారు. తన ఆస్తి మొత్తాన్ని కొండగట్టు అంజన్నకు అందాలంటే పట్టా చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన కోరారు

## అమెరికాకు ఇరగవరం సర్పంచ్ హేమ

**ఏలూరు :** అమెరికా ఐక్యరాజ్య సమితిలో నిర్వహించే గొప్ప సదస్సుకు ఏపీకి చెందిన ఓ గ్రామ సర్పంచ్ ఎన్నికయ్యారు. మే 3న నిర్వహిస్తున్న 57వ మకిషన్ ఆన్ పాపులేషన్ అండే డెవలప్ మెంట్ సదస్సులో పాల్గొననున్నారు. ఏపీలో సీఎం జగన్ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. అలాగే సామాజిక సమీకరణాలు, మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తున్నారు. ఈ క్రమంలోనే 2021 ఏప్రిల్?లో పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో ఒక మహిళకు అవకాశమిచ్చారు సీఎం జగన్. ఆమె ఎన్నికైన ప్రభుత్వ పనితీరును, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సఖ్యత, అభివృద్ధి గురించి వివరించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఈమె పేరును సిఫార్సు చేసింది. దీంతో ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో మే 3వ తేదీని నిర్వహిస్తున్న 57వ మకిషన్ ఆన్ పాపులేషన్ అండే డెవలప్ మెంట్ సదర్సులో పాల్గొనేందుకు హేమ కుమారికి ఈ అదృష్టం వరించింది. ఈ ఐదేళ్ల పాలనలో మన రాష్ట్రం నుంచి పలువురు ఈ ఐక్యరాజ్య సమితి వేదికపై ప్రసంగించేందుకు అవకాశాన్ని సంపాదించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తమ గ్రామంలోని విద్య, వైద్యం, మౌళిక వసతులు, అభివృద్ధి గురించి వివరించేందుకు అవకాశం లభించగా, తాజాగా గ్రామ సర్పంచ్?కు ఈ అదృష్టం వరించడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. న్యూయర్క్ నగరం యూఎన్ఓ ప్రధాన కార్యాలయంలో జరిగిన హైలెవల్ పొలిటికల్ ఫోర్ కార్యక్రమాంలో పాఠశాల విద్యార్థులకు అవకాశం లభించగా అమెరికా ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రసంగించే అవకాశం ఈ సర్పంచ్?కు లభించింది.ఆంధ్రప్రదేశ్ నుంచి సర్పంచ్ హేమ కుమారి, త్రిపుర నుంచి సెపాహిజాల జడ్పీ చైర్ పర్సన్ సుప్రియ దాస్‌దత్తా, రాజస్థాన్ నుంచి ఝుంజున్ జిల్లా లంబిఅహిర్ సర్పంచ్ నీరూ యాదవ్?లకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ ముగ్గురునీనివ భారత దేశంలోని స్థానిక సంస్థల ప్రభుత్వాల్లో మహిళల పాత్ర, మహిళా సాధికారతకు మార్గాలు, సాధించిన లక్ష్యల గురించి ప్రసంగించాల్సి ఉంటుంది. ఏపీ నుంచి ఎంపికైన సర్పంచ్ హేమ కుమారి 2022 లో కాకినాడ జేఎన్‌టీయూ నుంచి ఎంటెక్ పట్టా పొందారు. అలాగే ఐదేళ్ల పాటు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ లెక్చరర్?గా పనిచేశారు. వీరంతా కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, సహాయ కార్యదర్శి అలోక్ ప్రేమ్ కుమార్ లతో కలిసి భారత్ ప్యానల్ తరుపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో గ్రామీణ స్థానిక సంస్థల ప్రభుత్వాల్లో జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రపంచం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మూడు రాష్ట్రాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను మాత్రమే ఐక్యరాజ్యసమితికి సిఫార్సు చేయడం విశేషం.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను నమ్మి మోసపోవద్దు





**పోడు పట్టాల రైతులకు రుణాలు మంజూరు చేయాలి**
**వెంటనే రైతు రుణ మాఫీ చేయాలి**
**రైతు రుణ మాఫీ అని చెప్పి అధికారంలోకి వచ్చి రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది**
**స్వతంత్ర ఎంపి అభ్యర్థి రాథోడ్ సుభాష్**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల ఎంపి అభ్యర్థులు రాజకీయ పార్టీలు మాత్రమే మారారని వారి ఆలోచన మారలేదని ఆదిలాబాద్ పార్లమెంటు స్వతంత్ర ఎంపి అభ్యర్థి రాథోడ్ సుభాష్ అన్నారు. పార్లెంటులో నియోజకవర్గంలోని ఆసిఫాబాద్, కేరామేరి, ఇంద్రవెల్లి , లాల్ టెక్డి, హిరాపూర్, హస్నాపూర్, జైనూరు తదితర గ్రామాల్లో విస్తృతంగా గ్యాస్ సిలిండర్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. పదుల సార్లు అవకాశం ఇచ్చిన ఇప్పటి వరకు ఉన్న రోడ్లు వెడల్పు కాలేవని, రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు లేవని అన్నారు. ఎలాంటి మౌలిక వసతులు సౌకర్యాలు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఆదిలాబాద్ ప్రజల్ని ఓటు సమయంలో మాత్రమే సెంటిమెంట్ తో రెచ్చగొట్టి గెలుస్తున్న నాయకులు వారి అభివృద్ధికి మాత్రం చేసింది శూన్యమని అన్నారు. పోడు పట్టలకు రుణాలు ఇవ్వడం లేదని దీంతో ఎంతో మంది ఆదివాసి గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతు రుణ మాఫీ చేస్తామని ఓటు అడిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మళ్ళీ మరోసారి ఓటు వేసి ఎంపి ఎన్నికలు గెలిపిస్తే రుణ మాఫీ చేస్తానని అనడం చూస్తుంటే ప్రజలను మోసం చేసే ప్లాన్ స్పష్టంగా ఉందని అన్నారు. కాళేశ్వరం కట్టి లక్షల కోట్లు అవినీతి చేసిన కేసీఆర్ దగ్గర నుండి ప్రజా ధనం కక్కిస్త అని హడావిడి చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు కనీసం ఆ విషయం కూడా ఎత్తడం లేదని అన్నారు. దీన్ని బట్టి రెండు పార్టీలు కుమ్మక్కై ప్రజలను మభ్యపెట్టి ఓటు రాబట్టుకోవడం రాటుదేలాయని అన్నారు. తాను గెలిచిన వెంటనే కాంగ్రెస్ పార్టీ చెప్పిన హామీలు అమలు చేసేదాకా పోరాడుతానని , న్యాయ పోరాటం కూడా చేస్తానని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని ఆశ చూపెట్టి మోసం చేసిన బి అర్ ఎస్ , కాంగ్రెస్ పార్టీలను స్వతంత్ర అభ్యర్థినీ గెలిపించి ఓటరు ఎం చేయగలుగుతా రో చూపెట్టి గట్టి బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి గోవింద్ , శంకర్ నాయక్ , శ్రీకాంత్, కిట్టు పాన్పట్టే, తరుణ్, సాయి కుమార్ తదితరులు పాల్గోన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం... క్యూ కడుతున్నారు



**వరంగల్ :** ఓ వైపు పార్లమెంట్ ఎన్నికల హడావుడి నడుస్తుండగానే.. మరోవైపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ రిలీజ్ కావడంతో పార్టీలు అభ్యర్థుల ఎంపిక పై కసరత్తు చేస్తున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఇప్పటికే కాంగ్రెస్ నుంచి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న పేరును ఖరారు చేయగా.. సిట్టింగ్ స్థానం కోసం బీఆర్ఎస్ లో టికెట్‌కు పోటీ నెలకొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగుల రాకేశ్ రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ హామీ ఇచ్చి ఆయనను బీజేపీ నుంచి గులాబీ పార్టీలో చేర్చుకోగా.. ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ అయిన తరువాత పలువురు ఉద్యమ కారుల పేర్లు వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపు తుందోననే చర్చ జరుగుతోంది.అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు బీజేపీ రాష్ట్ర అధికారిగా పని చేసిన ఏనుగుల రాకేశ్ రెడ్డి.. తనకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే టికెట్ కేటాయించకపోవడంతో ఆయన ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు.విద్యావంతుడు, వాక్చాతుర్యం కలిగిన నాయకుడు కావడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు బీఆర్ఎస్ కీలక నేత పల్లా రాజేశ్వర్ రెడ్డి చొరవతో రాకేశ్ రెడ్డి గులాబీ పార్టీ వైపు అడుగులు వేశారు. దీంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ హామీ ఇచ్చి.. రాకేశ్ రెడ్డిని పార్టీలో చేర్చుకున్నారు. ఇదిలాఉంటే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడం, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ గా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయ్యింది. దీంతో ఎన్నికల కమిషన్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ రిలీజ్ చేయగా గతంలో కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు రాకేశ్ రెడ్డి తనకే టికెట్ దక్కుతుందనే ఆశలో ఉన్నారు.వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానంపై రాకేశ్ రెడ్డి ఆశలు పెట్టుకోగా.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేతలు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు క్యూ కడుతున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ సర్కారులో దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ గా పని చేసిన కె.వాసుదేవారెడ్డి ఎమ్మెల్సీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.ఇప్పటి నుంచే గ్రాడ్యుయేట్లకు దగ్గరయ్యే ప్రయత్నాలు కూడా మొదలుపెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సపోర్టుతో ఆయన గులాబీ పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. మరోవైపు మాస్టర్ జీ విద్యాసంస్థల అధినేత, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ పేరు కూడా తెరమీదకు వచ్చింది.మాజీ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అనుచరుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా పేరున్న సుందర్ రాజ్ యాదవ్ ఈసారి గ్రాడ్యుయేట్ టికెట్ ఆశిస్తున్నారు. ఆయన విద్యాసంస్థలకు చెందిన గ్రాడ్యుయేట్లు, అధ్యాపకుల యూనియన్లు ఆయనకు మద్దతు ఇస్తారనే ఉద్దేశంతో ఆయన పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.ఉద్యమకారుడిగా సుందర్‌రాజు మూడు ఉమ్మడి జిల్లాల్లోని వివిధ కాలేజీలు, విద్యాసంస్థల యజమాన్యాలతో సత్సంబధాలు కూడా కలిసి వస్తాయని భావిస్తున్నారు. ఈ ఇద్దరితో పాటు ముఖ్యంగా సీనియర్ జర్నలిస్ట్ తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఉద్యమకారుడిగా, సీనియర్ జర్నలిస్టుగా వరంగల్, ఖమ్మం, నల్గొండ మూడు ఉమ్మడి జిల్లాల్లో మంచి పట్టుండటంతో ఆయన బరిలో నిలిచే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు పల్లె రవికుమార్కు హామీ ఇచ్చినట్లు తెలిసింది.గత ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గట్టిపోటీ ఇచ్చిన తీన్మార్ మల్లన్న.. ఈసారి అధికార కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండటంతో సత్తా ఉన్న నాయకుడినే బరిలో దింపాలని గులాబీ పార్టీ ఆలోచన చేస్తోంది. ఈ నేపథ్యంలో మూడు జిల్లాల్లో మల్లన్నను ఢీకొట్టే నాయకుడెవరనే చర్చ జరుగుతుండగా.. ఇప్పటికే గులాబీ పార్టీ కసరత్తు మొదలుపెట్టింది.పార్టీ ముఖ్యనేతలు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు, వినయ్ భాస్కర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఇతర నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థిని ప్రకటించే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఎంపీ ఎన్నికల కోసం ఎదురీదుతున్న బీఆర్ఎస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీపైనా గట్టిగానే గురి పెట్టింది. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని, పార్టీ నేతలు చెబుతుండగా.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ ఎవరి వైపు మొగ్గుచూపుతారోనని ఆ పార్టీ నేతల్లో టెన్షన్ నెలకొంది.

# ఆంధ్రకు 3 వేల బస్సులు



**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. వాటితో పాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహిస్తున్నారు. ఏడు విడతల్లో పోలింగ్ జరుగుతోంది. జూన్ 4న ఫలితాలు ప్రకటించనున్నారు. ఏపీకి సంబంధించి మే 13న పోలింగ్ జరగనుంది. దక్షిణాది రాష్ట్రాల్లో అందరి దృష్టి ఏపీ పైనే ఉంది. సాధారణంగా ఎంపీ ఎన్నికల కంటే అసెంబ్లీకి ఎక్కువ మంది ప్రాధాన్యమిస్తారు. ఎక్కడ ఉన్నా ఓటు వేసేందుకు స్వరాష్ట్రానికి వస్తారు.సొంత గ్రామానికి వెళ్లి ఓటు వేసేందుకు ఇష్టపడతారు.అయితే వలస ఓటర్లను రప్పించేందుకు అన్ని పార్టీలు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో? స్వగ్రామాలు చేరుకోవడం చాలా ఈజీ అవు తుంది. ఏపీ నుంచి ప్రజలు ఎక్కువగా వలస పోతుం టారు.ఉద్యోగ ఉపాధి కోసం హైదరాబాద్,బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వెళుతుంటారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర నుంచి వలస బాట అధికం. అటువంటి వారు ఎన్నికల సమయంలో స్వగ్రామాలకు వెళ్లడం జరుగుతుంటుంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ వలస ఓటర్ల తరలింపు అధికంగా జరిగేది. కానీ ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వలస ఓటర్లను తెప్పించేందుకు రకరకాల ప్రయత్నాలు ముందుగానే జరుగుతున్నాయి. ఆరోజు దాదాపు 3000 బస్సులు ఏపీకి రానున్నట్లు తెలుస్తోంది. రాను పోను ఖర్చులతో పాటు భోజనం, ఇతరత్రా ఖర్చులు పెట్టేందుకు రాజకీయ పార్టీలు సిద్ధపడుతున్నాయి.ఒక్క హైదరాబాదు నుంచి దాదాపు 2000 బస్సులు బుక్ అయినట్లు తెలుస్తోంది. అవి హైదరాబాదులో 11వ తేదీన బయలుదేరుతాయి. ఆ మరుసటి రోజున వలస ఓటర్లు స్వగ్రామాలకు చేరుకోనున్నారు. ఓటు వేసిన తర్వాత 13వ తేదీ సాయంత్రం తిరిగి ఆ బస్సులు బయలుదేరనున్నాయి. అయితే ఈ వలస ఓటర్లను తరలించేందుకు అన్ని పార్టీలు ప్రత్యేకంగా కొందరు మనుషులను నియమించుకున్నారు. వారే వలస ఓటర్లవివరాల సేకరణ, ఏయే ప్రాంతాల్లో ఉంటారు. వారిని ఎలా తరలించాలి. వంటి విషయాలన్నీ వారే చూసుకుంటారు. అయితే దాదాపు ప్రైవేటు ట్రాన్స్పోర్ట్ కంపెనీలకు చెందిన బస్సులు ఏపీ ఎన్నికలకు రానున్నట్లు తెలుస్తోంది.

# రజనీ బయోపిక్ రానుందా?




సినిమాల్లో తమ అభిమాన హీరోలు చేసే యాక్షన్ హంగామాను చూస్తూ మురిసిపోతుంటారు ప్రేక్షకులు. మరి అలాంటి ఎంతో మంది అభిమానుల్ని సొంతం చేసుకున్న హీరో జీవితమే తెరపై వస్తే సినీప్రియులకి పండగే కదా. బాలీవుడ్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలతో దర్శకనిర్మాతగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సాజిద్ నడియాడ్‌వాలా. ఇప్పుడాయన తమిళ అగ్రకథానాయకుడు రజనీకాంత్ బయోపిక్‌ను రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. "సాజిద్ కేవలం రజనీకాంత్ నటనకు మాత్రమే కాదు. ఆయన వ్యక్తిత్వానికి కూడా వీరాభిమాని అనే విషయం కొద్ది మందికి మాత్రమే తెలుసు. ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఆయన జీవితాన్ని తెరపై చూపించాలని నిర్ణయించుకున్నారు సాజిద్. బస్ కండక్టర్ నుంచి సూపర్ స్టార్ వరకు ఎదగడానికి రజనీకాంత్ ఎదుర్కొన్న సవాళ్లను ఒక సినిమాగా తీర్చిదిద్దాలనుకుంటున్నారు. కొన్ని రోజులుగా ఈ ప్రాజెక్టు కోసం ఆయన కుటుంబంతో చర్చలు జరుపుతున్నారు" అని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్ పనులు కూడా ప్రారంభమైనట్లు సమాచారం.

# హరిహర వీరమల్లు వచ్చేశాడు!

## పవన్ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చిన మేకర్స్!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం హరిహరవీరమల్లు. ఈ మూవీ నుంచి ఎట్టకేలకు టీజర్ విడుదలైంది. క్రిష్ దర్శకత్వంలో వస్తున్న మూవీపై అభిమానుల్లో భారీగా అంచనాలున్నాయి. చాలారోజుల నుంచి ఫ్యాన్స్ మూవీ అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. తాజాగా మేకర్ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇస్తూ టీజర్‌ను వదిలింది. ఈ టీజర్ అభిమానులను ఆకట్టుకుంటున్నది. 'మనల్ని ఇంత హింసించి మన కష్టాన్ని దోచుకుంటున్నారు. ప్రతి వాన్ని వాడిపైవాడు దోచుకుంటాడు. మనల్ని దొర దోచుకుంటే.. దొరను గోల్కొండ నవాబు దోచుకుంటాడు. ఆ నవాబును ఢిల్లీలో ఉండే మొఘల్ చక్రవర్తి. మనపై ఉన్న ఈ దొంగల్ని దోచుకోవడానికి భగవంతుడి ఒకడిని ఖచ్చితంగా పంపిస్తాడు' అంటూ మొదలయ్యే ఈ టీజర్ అభిమానులను ఆకట్టుకుంటున్నది. ఈ మూవీలో పవన్ కల్యాణ్ పవర్ ఫుల్ యాక్షన్ సీన్స్‌లో కటించనున్నట్లు టీజర్‌ను చూస్తేనే అర్థమవుతుంది. ఈ చిత్రం రెండు భాగాలుగా రానుండగా.. తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. పేదలు దోపిడీకి గురవుతూ, ధనవంతులు మరింత అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో.. న్యాయం కోసం యుద్ధం చేసే ఒంటరి యోధుడుగా పవన్ కల్యాణ్ కనిపించబోతున్నారు. 17వ శతాబ్దంలో పేదల పక్షాన పోరాడిన ఒక యోధుడి పాత్రలో పవన్ కనిపించున్నారు. ఈ మూవీలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నది. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఏ దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.





# విడుదలకి సిద్ధం అవుతున్న అల్లరోడు!

అల్లరి నరేష్ హీరోగా తెరకెక్కుతున్న మూవీ 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ చిత్రానికి మల్లి అంకం దర్శకుడు. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మించారు. కొన్నాళ్లుగా సీరియస్ సబ్జెక్టుల దారిలో వెళ్లిన అల్లరి నరేశ్..మళ్లీ తన మార్క్ కామెడీ ఎంటర్‌టైన్?మెంట్?తో 'ఆ ఒక్కటి అడక్కు' చిత్రం చేశారు. కమెడియన్ నుంచి హీరోగా మారిన సుహాస్ వరుస విజయాలతో ఫుల్ ఫామ్?లో ఉన్నారు. మే 3వ తేదీనే ఆ ఒక్కటి అడక్కు చిత్రం థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద అల్లరినరేశ్ తన స్టైల్ లో కామెడీ తో ఆకట్టుకోవడానికి రెడీ అవుతున్నారు.. ఈ చిత్రం సెన్సార్ కూడా పూర్తయింది. ఈ సినిమా యూ/ఏ సర్టిఫికెట్ నుఅందుకున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 2 గంటల 14 నిమిషాల నిడివితో ఆ ఒక్కటి అడక్కు సినిమా రిలీజ్ కానుందని తెలిపారు. చాలా గ్యాప్ తరువాత అల్లరి నరేష్ తన కామెడీ ట్రాక్ లోకి వచ్చాడు. ఈ మధ్యకాలంలో సీరియస్ పాత్రలు చేస్తూ కనిపించిన నరేష్.. మళ్లీ ఈ సినిమాతో కామెడీ పంథాను ట్రై చేస్తున్నాడు. ముప్పై ఏళ్ళు దాటినా కూడా పెళ్లి కానీ యువకుడు పడే బాధలను ఈ చిత్రంలో చూపించారు. ఈ సినిమా ప్రతి ఒక్క కుర్రాడికి నచ్చుతుందని మేకర్స్ తెలిపారు. ఇక సెన్సార్ తో పాటు బుకింగ్స్ కూడా ఓపెన్ అయ్యాయి. చాలా గ్యాప్ తరువాత నరేష్కామెడీ సినిమాతో వస్తుండడంతో బుకింగ్స్ మంచిగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ ఒక్కటి అడక్కు మూవీలో అల్లరినరేశ్ సరసన ఫారియా అబ్దుల్లా హీరోయిన్?గా నటించారు. వెన్నెల కిశోర్, జామీ లేవర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ, హరితేజ కీరోల్స్ చేశారు. మల్లీ అంకం ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.



# అభినయం ఉన్నా అదృష్టం లేని అను!



చాలా మంది హీరోయిన్స్ టాలీవుడ్ లో కొన్ని లు చేసిన తర్వాత కనిపించకుండా పోయారు. అందం అభినయం ఉన్నా కూడా అవకాశాలు లేక కనిపించకుండా పోయారు. ఇప్పుడు ఆ లిస్ట్ లో చేరిపోయారు అను ఇమ్మాన్యుయేల్. చాలా మంది హీరోయిన్స్ టాలీవుడ్ లో కొన్ని లు చేసిన తర్వాత కనిపించకుండా పోయారు. అందం అభినయం ఉన్నా కూడా అవకాశాలు లేక కనిపించకుండా పోయారు. ఇప్పుడు ఆ లిస్ట్ లో చేరిపోయారు అను ఇమ్మాన్యుయేల్. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన మజ్ను తో పరిచయం అయ్యింది అను. తొలి తోనే మంచి విజయాన్ని అందుకుంది. అలాగే తన నటనతో .. అందంతో ఆకట్టుకుంది. ఆతర్వాత వరుసగా లు చేస్తూ వచ్చింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అజ్ఞాత వాసి లోనూ నటించింది. కానీ ఆ ఫ్లాప్ అవ్వడంతో ఈ చిన్నదానికి అంతగా గుర్తింపు రాలేదు. ఆ తర్వాత కొన్ని ల్లో మెరిసింది. తెలుగులో సైరైన హిట్స్ పడకపోవడంతో తమిళ్ ఇండస్ట్రీకి చెక్కేసింది. అక్కడ శివకార్తికేయన్ తో చేసింది ఆ కూడా అంతగా ఆకట్టుకోలేకాదు. చివరిగా కార్తీ హీరోగా నటించిన జపాన్ లో కనిపించింది. జపాన్ కూడా ఈ అమ్మడిని నిరాశపరిచింది. దాంతో అనూకు అవకాశాలు తగ్గాయి. ఇప్పుడు అస్సలు లేకుండా పోయాయి. దాంతో సోషల్ మీడియాతో అందరి దృష్టిని ఆకర్షించే పనిలో పడింది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది అను.

# వార్ వన్ సైడే..

## ఆరేండ్ల తర్వాత సోలోగా వస్తున్న ఎన్టీఆర్!

2024లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులే కాకుండా ప్రేక్షకులు సైతం ఎదురుచూస్తున్న చిత్రం దేవర. ఎన్టీఆర్ కొరటాల శివ కాంబోలో ఈ సినిమా వస్తుండడంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండగా.. ఈ చిత్రంలో శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా గ్లింప్స్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా వస్తున్న విషయం తెలిసిందే. మొదటి పార్ట్ దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మూవీ నుంచి సర్‌ప్రైజ్ ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ బర్త్ డే (మే 20) కానుకగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ లాంచ్ అవ్వనున్నట్లు టాక్. కాగా దీనిపై మేకర్స్ క్లారిటీ ఇవ్వవలసి ఉంది. మరోవైపు ఈ సినిమాతో తారక్ సోలోగా బాక్సాఫీస్ బరిలోకి దిగుతున్నట్లు తెలుస్తుంది. దసరా కానుకగా ఈ మూవీ వస్తుండగా.. దేవరకు పోటీగా చుట్టుపక్కల ఏ మూవీ లేకపోవడం విశేషం. ఇంతకుముందు నాగచైతన్య తండేల్ సినిమా కూడా దసరా బాక్సాఫీస్ బరిలో దిగుతున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ మళ్లీ రేసు నుంచి తప్పుకున్నారు. అయితే ఆరేళ్ల తర్వాత తారక్ సోలోగా బాక్సాఫీస్ బరిలోకి దిగుతుండడంతో దేవరకు భారీగా కలెక్షన్స్ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. తారక్ చివరిగా అరవింద సమేత సినిమాతో సోలోగా బాక్సాఫీస్ ముందుకు వచ్చాడు. 2018లో త్రివిక్రమ్ డైరెక్షన్‌లో వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత 2019 నుంచి 21 వరకు ఎన్టీఆర్ సినిమాలే రిలీజ్ కాలేదు. ఇక తర్వాత 2022లో రామ్ చరణ్‌తో కలిసి ఆర్ఆర్ఆర్ సినిమా చేశాడు. మళ్లీ 2023లో ఏ సినిమా రిలీజ్ కాలేదు. ఇప్పుడు 2024లో అంటే దాదాపు ఆరేళ్ల తర్వాత ఎన్టీఆర్ సోలోగా వస్తున్నాడు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com